ప్రజా
# రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

పాత్రికేయులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
రిపబ్లిక్
తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు, జిల్లా స్టాఫర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి పాత్రికేయులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Districts
సంపుటి - 03 సంచిక -32 పేజీలు - 8 వెల - 03/- మంగళవారం19 మే 2026

# గడువులోగా ప్రాజెక్టులు

## 36 ప్రాజెక్టుల పనులపై సీఎం చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష

- సమీక్షలో సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు
- ఇరిగేషన్ క్యాలెండర్‌కు కొత్తగా 11 ప్రాజెక్టులను చేర్చిన ప్రభుత్వం
- 2027 ఏప్రిల్ నాటికి పోలవరం నిర్వాసితుల తరలింపు పూర్తి చేయాలని ఆదేశం
- వెలిగొండ, హంద్రీ-నీవా పనులను వేగవంతం చేయాలని అధికారులకు దిశానిర్దేశం
- ఖరీఫ్ సీజన్ ఆలస్యం కాకుండా కాల్వలకు నీరివ్వాలని సూచన



**అమరావతి,, మే 18 (రిపబ్లిక్ న్యూస్):** రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల పనులను వేగవంతం చేసే దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నారు. గతంలో ప్రకటించిన ఇరిగేషన్ క్యాలెండర్‌కు అదనంగా మరో 11 ప్రాజెక్టులను చేర్చి, వాటిని ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో ఇరిగేషన్ క్యాలెండర్‌లోని మొత్తం ప్రాజెక్టుల సంఖ్య 36కు చేరింది. సోమవారం సచివాలయంలో జలవనరుల శాఖపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన **మిగతా 2లో..**


## ఏపీలో 16,000 ఇ-సైకిళ్లు..

- ఉద్యమంగా మార్చాలన్న సీఎం చంద్రబాబు
- ఏపీలో విద్యుత్ వాహనాల వినియోగాన్ని ఉద్యమంగా మార్చే యోచన
- స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు కార్యాలయాలకు 16,000 ఇ-సైకిళ్లు



# భారత్, నార్వే మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం

- ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నార్వే అండగా నిలిచింది: ప్రధాని మోడీ
- ఇంజనీరింగ్ విభాగాల్లోనూ ఇరుదేశాల మధ్య పలు ఒప్పందాలు



**ఓస్లో: , మే 18 (రిపబ్లిక్ న్యూస్):** అత్యంత క్లిష్టసమయంలో ఉగ్రవాదానికి వ్యతిరేకంగా, భారతదేశానికి, నార్వే అండగా నిలిచి, తన నిజమైన స్నేహాన్ని చాటుకుందని ప్రధాని నరేంద్ర మోడీ ప్రశంసించారు. సోమవారం నార్వే ప్రధాని జోనాస్ గహర్ స్టోర్తో ద్వైపాక్షిక చర్చలు జరిపిన తరువాత, ప్రధాని మోడీ పలు కీలక అంశాలపై మాట్లాడారు. సైనిక ఘర్షణల ద్వారా మాత్రమే శాశ్వత శాంతిని సాధించలేమని ప్రధాని మోడీ అన్నారు. పశ్చిమాసియా సంక్షోభాన్ని, ఉక్రెయిన్ వివాదాన్ని చర్చలు, దౌత్య మార్గాల ద్వారా పరిష్కరించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు."భారత్, నార్వే రెండూ కూడా నియమ, నిబంధనలతో కూడిన ప్రపంచ వ్యవస్థను, చర్చలను, దౌత్యాన్ని విశ్వసిస్తాయి. **మిగతా 2లో..**




## బుల్లెట్ వేగంతో రాయల్ ఎన్‌ఫీల్డ్ ఫ్యాక్టరీ

### సిఎం చంద్రబాబుతో ప్రతినిధుల భేటీ

**అమరావతి,, మే 18 (రిపబ్లిక్ న్యూస్):** ఆంధ్రప్రదేశ్‌లో ప్రముఖ ద్విచక్ర వాహన తయారీ సంస్థ రాయల్ ఎన్‌ఫీల్డ్ భారీ పెట్టుబడితో తయారీ యూనిట్ ఏర్పాటు చేయనుంది. ఈ నేపథ్యంలో **మిగతా 2లో..**

# కేరళం సిఎంగా సతీశన్ ప్రమాణం

- ఆయనతోపాటు 20 మంది మంత్రులకు ఛాన్స్
- హాజరైన రాహుల్, ప్రియాంక, ఖర్గే, రేవంత్ రెడ్డి



**తిరువనంతపురం,, మే 18 (రిపబ్లిక్ న్యూస్):** కేరళ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వీడీ సతీశన్ కేరళం రాష్ట్ర కొత్త ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. సోమవారం ఉదయం గవర్నర్ ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. తిరువనంతపురంలోని సెంట్రల్ స్టేడియంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, మల్లికార్జున ఖర్గే.. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు పాల్గొన్నారు. కాగా, మొత్తం 20 మందితో **మిగతా 2లో..**



## కేబీఆర్ పార్క్ చుట్టూ చెట్ల నరికివేతపై స్టే

### సుప్రీం ఆదేశాలతో నిలిచిపోనున్న ఫ్లై ఓవర్ నిర్మాణాలు



**న్యూఢిల్లీ, మే 18 (రిపబ్లిక్ న్యూస్):** కేబీఆర్ పార్క్ పరిసరాల్లో చెట్ల నరికివేతపై సుప్రీం కోర్టు స్టే విధించింది. ఎకో సెన్సిటివ్ జోన్ లోపల చెట్లను ఎట్టి పరిస్థితుల్లోనూ నరకరాదని ఉన్నత న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. కేబీఆర్ పార్క్ చుట్టూ ఫ్లై ఓవర్ నిర్మాణాన్ని తెలంగాణ ప్రభుత్వం చేపట్టగా..**మిగతా 2లో..**

## ఏపీలో 'ఎస్ఐఆర్'..

- అలర్ట్ గా ఉండాలంటూ పార్టీ శ్రేణులకు సజ్జల ఆదేశం
- జూన్ 15 నుంచి ఏపీలో ఎస్ఐఆర్ జరుగుతుందన్న సజ్జల
- అప్రమత్తంగా ఉండాలని పార్టీ శ్రేణులకు సూచన
- సమర్థవంతంగా పనిచేసిన వారికి తగిన గుర్తింపు ఉంటుందని వెల్లడి



**అమరావతి,, మే 18 (రిపబ్లిక్ న్యూస్):** ఆంధ్రప్రదేశ్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం నేపథ్యంలో వైసీపీ తన క్యాడర్‌ను ఈ కార్యక్రమం కోసం సిద్ధం చేస్తోంది. పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్లమెంటరీ పరిశీలకులతో నిర్వహించిన కీలక సమావేశంలో వైసీపీ స్టేట్ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ ఓటర్ల సవరణ ప్రక్రియ జూన్ 15న ప్రారంభమై సెప్టెంబర్ వరకు అత్యంత కీలకమైన దశల వారీగా సాగనుందని ఆయన వివరించారు. **మిగతా 2లో..**




# న్యూక్లియర్ ఆర్థిక వ్యవస్థలో ఏపీ అగ్రగామి

- న్యూక్లియర్ ఎనర్జీ పరిశ్రమ కొత్త దశ
- యూఎస్-ఇండియా స్ట్రాటజిక్ పార్ట్‌నర్ షిప్ ఫోరంలో లోకేశ్

**న్యూఢిల్లీ, మే 18 (రిపబ్లిక్ న్యూస్):** ఏపీని భవిష్యత్తు న్యూక్లియర్ ఆర్థికవ్యవస్థలో నమ్మకమైన గ్లోబల్ భాగస్వామిగా నిలబెట్టడం తమ ధ్యేయమని ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్య శాఖల మంత్రి నారా లోకేశ్ వ్యాఖ్యానించారు. ప్రపంచ న్యూక్లియర్ ఎనర్జీ పరిశ్రమ కొత్త దశలోకి ప్రవేశిస్తున్ననేపథ్యంలో ఇది కీలకంగా మారగలదని పేర్కొన్నారు. న్యూక్లియర్ ఎనర్జీ ఇనిస్టిట్యూట్, యూఎస్-ఇండియా స్ట్రాటజిక్ పార్ట్‌నర్ షిప్ ఫోరం సంయుక్తంగా **మిగతా 2లో..**

# ఖరీఫ్ సాగుకు సిద్ధంగా ఉండండి

- జూన్ 1నుంచి కాలువల్లోకి నీరు విడుదల
- రైతులకు మంత్రులు అచ్చన్న, రామానాయుడు భరోసా



**అమరావతి, మే 18 (రిపబ్లిక్ న్యూస్):** రైతులు ఖరీఫ్ సాగుకు సిద్ధంగా ఉండాలని, జూన్ 1 నుంచి కాలువల్లోకి సాగునీరు విడుదల చేస్తామని మంత్రులు ప్రకటించారు. ఖరీఫ్-2026 సాగునీటి విడుదలపై మంత్రులు అచ్చెన్నాయుడు, నిమ్మల రామానాయుడు సచివాలయంలో సోమవారం సమిక్ష నిర్వహించారు. కాలువల్లో పూడిక తొలగింపు పనులను మే చివరికి పూర్తి చేయాలని **మిగతా 2లో..**

# భారత్, నార్వే మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం

**మొదటిపేజీ తరువాయి**

కేవలం సైనిక ఘర్షణ ద్వారా మాత్రమే ఏ సమస్యనూ పరిష్కరించలేమని మేము ఇద్దరం భావిస్తున్నాం. ఉక్రెయిన్, పశ్చిమాసియా ఘర్షణలు వీలైనంత త్వరగా ముగియడానికి, శాంతి స్థాపన కోసం జరిగే ప్రతి ప్రయత్నానికి మేము మా మద్దతును ఇస్తాం." అని మోడీ చెప్పారు.

**అంతర్జాతీయ సంస్థలను సంస్కరించాలి**

నాలుగు ఐరోపా దేశాల పర్యటనలో భాగంగా స్వీడన్ నుంచి నార్వే రాజధాని ఓస్లో చేరుకున్న కొద్ది గంటల్లోనే మోడీ, ఆ దేశ ప్రధాని స్టోర్తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ప్రధాని మోడీ మాట్లాడుతూ, అంతర్జాతీయ సంస్థలను సంస్కరించాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. "పెరుగుతున్న ప్రపంచ సవాళ్లను ఎదుర్కొనేందుకు అంతర్జాతీయ సంస్థలలో సంస్కరణలు తీసుకురావడం అత్యవసరం. ఈ విషయంలో నేను, నార్వే ప్రధాని ఏకాభిప్రాయంతో ఉన్నాం. అంతేకాదు ఉగ్రవాదాన్ని దాని అన్ని రూపాల్లోనూ సమూలంగా నిర్మూలించడం మన ఉమ్మడి బాధ్యత" అని ఆయన స్పష్టం చేశారు.

**నిజమైన స్నేహం**

గతేడాది పహల్గాంలో హిందూ పురుషులే లక్ష్యంగా జరిగిన పాక్ ప్రేరిపిత ఉగ్రదాడిలో, భారత్కు చెందిన 26 మంది పౌరులు మరణించారు. ఈ విషయాన్ని ప్రస్తావించిన ప్రధాని మోడీ, ఆ క్లిష్ట సమయంలో భారత్కు నార్వే అందించిన మద్దతును కొనియాడారు. "నేను గత ఏడాదే నార్వేలో పర్యటించాల్సి ఉంది. కానీ పహల్గాం ఉగ్రదాడి కారణంగా ఆ పర్యటనను వాయిదా వేసుకోవాల్సి వచ్చింది. ఆ క్లిష్ట సమయంలో ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నార్వే, భారతదేశానికి అండగా నిలబడి, నిజమైన స్నేహాన్ని చాటుకుంది. ఈ రోజు నేను నార్వేను సందర్శిస్తున్న తరుణంలో, వారు చూపిన సంఘీభావానికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను." అని మోడీ తెలిపారు.

**ఇంజనీరింగ్ విభాగాల్లో కీలక ఒప్పందాలు**

ఇటీవల భారత్, ఈయూ మధ్య చారిత్రక ఒప్పందం జరిగిందని, దీని వల్ల భారత్, నార్వేలకు అనేక ప్రయోజనాలు కలుగుతాయని ఆయన అన్నారు. "భారత్, నార్వే మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం ఉంది. నార్వే నుంచి సాంకేతికత, పెట్టుబడులు భారత్కు వస్తున్నాయి. అలాగే వివిధ రంగాల్లో పరిశోధనల కోసం నార్వే నుంచి మేము సాయం తీసుకుంటాం. ఇంజినీరింగ్ విభాగాల్లోనూ ఇరుదేశాల మధ్య అనేక ఒప్పందాలు జరిగాయి. ఇస్రో, నార్వే స్పేస్ ఏజెన్సీల మధ్య మంచి సంబంధాలు ఉన్నాయి. ఇక ఇరుదేశాల మధ్య ఉన్న గ్రీన్ స్ట్రేటజీ వల్ల ప్రపంచ దేశాలకు అనేక ప్రయోజనాలు కలుగుతాయి. మారిటైమ్ భద్రత విషయంలోనూ మేము నార్వేతో కలిసి పనిచేస్తున్నాం" అని ప్రధాని మోడీ పేర్కొన్నారు.

# ఖరీఫ్ సాగుకు సిద్ధంగా ఉండండి


**మొదటిపేజీ తరువాయి**

అధికారులకు మంత్రులు ఆదేశాలు జారీ చేశారు. గత సీజన్లో 2025-26 ఖరీఫ్లో 99.35 లక్షల ఎకరాలకు 888 టీఎంసీల నీటి సరఫరా చేశామని, రబీ సీజన్లో 23.67 లక్షల ఎకరాలకు 153 టీఎంసీల నీరు అందించామని మంత్రులు తెలిపారు. రాష్ట్ర రిజర్వాయర్లలో 461 టీఎంసీల నీరు అందుబాటులో ఉందని వెల్లడించారు. గోదావరి డెల్టాకు జూన్ 1 నుంచి సాగునీరు విడుదల చేయనున్నట్లు మంత్రులు ప్రకటించారు. కృష్ణా డెల్టాకు జూలై 1 నుంచి, నాగార్జున సాగర్ ఆయకట్టుకు జూలై చివరికి, కె.సి. కెనాల్కు జూలై 15 నుంచి, వంశధార ఆయకట్టుకు జూన్ 15 నుంచి సాగునీరు విడుదల చేస్తామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా జిల్లాల వారీగా వ్యవసాయ శాఖ అధికారులతో మంత్రి అచ్చెన్నాయుడు వర్చువల్ మీటింగ్ నిర్వహించారు. ఖరీఫ్-2026 ప్రణాళికలు, ఎల్ నినో ప్రభావంపై సమీక్షించారు. రాష్ట్రవ్యాప్తంగా విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయని మంత్రి తెలిపారు. ఎరువులు పక్కదారి పడితే అధికారులపై చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు. యూరియా సరఫరా కోసం రైతులకు ప్రత్యేక కార్డులు అందజేస్తామని, అవసరం మేరకు ఆ కార్డు ద్వారా యూరియా తీసుకోవచ్చని తెలిపారు. ముందస్తు నిల్వలు వద్దని, రెండు-మూడు దశల్లో నానో యూరియా వినియోగించాలని సూచించారు. యుద్ధం కారణంగా యూరియా దిగుమతులకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని, అందువల్ల యూరియాను అవసరం మేరకు మాత్రమే వాడాలని రైతులకు అచ్చెన్నాయుడు సూచించారు. ఐదేళ్లు అధికారంలో ఉండి రైతాంగాన్ని పూర్తిగా అప్పుల ఊబిలోకి నెట్టిన వైసీపీ పాలకులు ఇప్పుడు రైతులపై సానుభూతితో మాట్లాడటం విడ్డూరంగా ఉందని మంత్రి అచ్చెన్నాయుడు మండిపడ్డారు. 'వైసీపీ పాలనలో వ్యవసాయ రంగం తీవ్రంగా దెబ్బతిన్నది. రైతులకు సరైన సమయంలో విత్తనాలు, ఎరువులు అందక ఇబ్బంది పడ్డారు. పంటలకు గిట్టుబాటు ధర లేక నష్టపోయారు. రైతు భరోసా పేరుతో చెప్పినంత ఇవ్వకుండా మోసం చేశారని మంత్రి పేర్కొన్నారు. మామిడి రైతుల సమస్యలపై మాట్లాడే ముందు వైసీపీ హయాంలో ఉద్యాన రైతులు ఎదుర్కొన్న కష్టాలను గుర్తు చేసుకోవాలన్నారు. వైసీపీ పాలనలో మొక్కజొన్న రైతుల పరిస్థితి దారుణంగా లేదా? కనీస మద్దతు ధర అమలులో విఫలం కాలేదా? రైతులు రోడ్లపై ఆందోళన చేసినా వైసీపీ ప్రభుత్వం పట్టించుకుందా? కేవలం ప్రచార రాజకీయాలు తప్ప.. రైతు సంక్షేమం పట్టించుకున్నారా? అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రైతులకు సంబంధించిన ప్రతి అంశంపైనా సమీక్ష చేస్తున్నాం. నిజంగా రైతుల కోసం పని చేయాలనే ఉద్దేశం వైసీపీ నేతలకు ఉంటే చౌకబారు విమర్శలు మానాలని హితవు పలికారు.

# న్యూక్లియర్ ఆర్థిక వ్యవస్థలో ఏపీ అగ్రగామి

**మొదటిపేజీ తరువాయి**

యూఎస్ ఎగ్జిక్యూటివ్ న్యూక్లియర్ మిషన్ టు ఇండియా పేరిట యూఎస్ న్యూక్లియర్ ప్రతినిధులతో సోమవారం ఢిల్లీలో నిర్వహించిన సదస్సుకు మంత్రి నారా లోకేశ్ అతిథిగా హాజరై ప్రసంగించారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీ ఎకోసిస్టమ్ ఉందని తెలిపారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ను అమలు చేస్తున్నామని అన్నారు. పారిశ్రామికీకరణలో వేగం, అమలు అత్యంత ముఖ్యమని చెప్పుకొచ్చారు. ఇందులో న్యూక్లియర్ ఎకోసిస్టమ్ ప్రముఖ పాత్ర వహించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని వెల్లడించారు. స్మాల్ మాడ్యులర్ రియాక్టర్లు, తదుపరితరం రియాక్టర్ సిస్టమ్స్ వంటి ఆధునిక న్యూక్లియర్ సాంకేతికతలు, మాడ్యులర్ తయారీ, సప్లయ్ చైన్ పంపిణీ, స్కేలబుల్ వినియోగం నమూనాలకి విస్తృత అవకాశాలు ఉన్నాయని మంత్రి లోకేశ్



వివరించారు. భారత్లో ఇంజనీరింగ్ ప్రతిభ, తయారీరంగంలో విస్తృతి, ఖర్చు విషయంలో పోటీతత్వం ఉన్నాయని వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాలు పారిశ్రామిక ఇన్ఫ్రా, పోర్ట్స్, లాజిస్టిక్స్ కనెక్టివిటీ, అమలు సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయని చెప్పుకొచ్చారు. ఇది భారతదేశానికి, ఆంధ్రప్రదేశ్కు ఒక చరిత్రాత్మక అవకాశాన్ని కల్పిస్తుందని తెలిపారు. ఏపీకి అనేక అదనపు ప్రయోజనాలు ఉన్నాయని లోకేశ్ తెలిపారు. తమకు సువిశాలమైన తీరప్రాంతం, శక్తివంతమైన పోర్ట్ ఇన్ఫ్రాస్ట్రక్చర్, విస్తతమైన పారిశ్రామిక కారిడార్లు, ప్రతిష్ఠాత్మకమైన పవర్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఉందని చెప్పుకొచ్చారు. పర్యావరణ వ్యవస్థ ఆలోచనా విధానం ముఖ్యమని అన్నారు. సాంకేతిక సహకారాలు, తయారీ భాగస్వామ్యాలు, సప్లై చైన్ అభివృద్ధి, ఇంజనీరింగ్ ఎకోసిస్టమ్స్, రీసెర్చ్ భాగస్వామ్యాలు, స్కిల్లింగ్, వర్క్ఫోర్స్ అభివృద్ధి, పారిశ్రామిక ప్రమాణాలు, భవిష్యత్తు సాంకేతికల అమలుకు విశ్వసనీయ గ్లోబల్ భాగస్వాములతో పనిచేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి యూఎస్ ? ఇండియా స్ట్రాటజిక్ పార్టనర్ షిప్ ఫోరం మేనేజింగ్ డైరెక్టర్ నివేదిత మెహ్రా స్వాగతం పలుకగా, న్యూక్లియర్ ఎనర్జీ ఇన్స్టిట్యూట్ ప్రెసిడెంట్, సీఈవో మారియా కోర్స్నిక్ హాజరయ్యారు.

# కేరళం సిఎంగా సతీశన్ ప్రమాణం

**మొదటిపేజీ తరువాయి**



మంత్రివర్గం ఏర్పాటు అయింది. సతీశన్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయగా.. 20 మంది మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. 20 మందిలో 14 మంది తొలిసారిగా బాధ్యతలు చేపట్టినవారే కావడం గమనార్హం. సామాజిక, ప్రాంతీయ, మిత్రపక్షాల సమీకరణాలను పరిగణనలోకి తీసుకుని కాంగ్రెస్ అధిష్ఠానం మంత్రులను ఎంపిక చేసింది. దీంతో దశాబ్దం తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్) తిరిగి అధికారంలోకి వచ్చింది. కేరళ ప్రతిపక్ష నాయకుడిగా బాధ్యతలు చేపట్టిన మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు రేవంత్రెడ్డి, సిద్ధరామయ్య, సుఖ్వీందర్ సింగ్ సుఖు, కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ తదితరులు హాజరయ్యారు. పార్టీ వర్గాలు వెల్లడించిన వివరాల ప్రకారం.. సీఎం సతీశన్ ఆర్థిక, ఓడరేవుల శాఖలతో సహా పలు కీలక పోర్ట్ఫోలియోలను తనవద్దే ఉంచుకునే అవకాశం ఉంది. సీనియర్ కాంగ్రెస్ నేత రమేష్ చెన్నితాలకు విజిలెన్స్తో పాటు హోం శాఖ బాధ్యతలను అప్పగించనున్నట్లు తెలుస్తోంది. కేరళ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు సన్నీ జోసెఫ్కు రెవెన్యూశాఖ కేటాయించాలని యూడీఎఫ్ నిర్ణయం తీసుకుంది. ఇకపోతే కొచ్చికి సమీపంలోని నెట్టూర్లో 1964లో వీడీ సతీశన్ జన్మించారు. వృత్తిరీత్యా న్యాయవాది అయిన ఆయన.. సామాజిక కార్యకర్తగానూ పేరొందారు. కేరళ విద్యార్థి విభాగంతో ఆయన రాజకీయ ప్రస్థానం మొదలైంది. తర్వాత యూత్ కాంగ్రెస్లో చేరి, పార్టీని బలంగా ముందుకు తీసుకెళ్లారు. తర్వాత కాంగ్రెస్లో ఒక్కో మెట్టూ ఎక్కుతూ ప్రజానేతగా, సంస్కరణాభిలాషిగా ఎదిగారు. 2001లో పరావుర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బరిలో నిలిచి, వరుసగా ఆరుసార్లు విజయం సాధించారు. 2021లో ఆయన కెరీర్ మలుపు తిరిగింది. ఆ ఎన్నికల్లో ఎల్డీఎఫ్ గెలుపొందగా.. యూడీఎఫ్ విపక్షానికే పరిమితమైంది. కానీ ఆయన అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా నియమితులయ్యారు. అవినీతి, గోల్డ్ స్మగ్లింగ్ వివాదం, శాంతి భద్రతలు, పరిపాలనాపరమైన వైఫల్యాలను ఎత్తిచూపి పినరయి విజయన్ ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టారు. అందుకే ప్రస్తుతం సీఎం ఎంపిక కోసం ఏఐసీసీ పరిశీలకులు జరిపిన అభిప్రాయ సేకరణలో కూడా ఎమ్మెల్యేలు, ప్రజలు సతీశన్కే మద్దతు ఇచ్చారు.

------------------

# ఏపీలో 'ఎస్ఐఆర్'..

**మొదటిపేజీ తరువాయి**

సజ్జల వెల్లడించిన షెడ్యూల్ ప్రకారం, జూన్ 15 నుంచి జూలై 14 వరకు రాష్ట్రవ్యాప్తంగా ముమ్మరంగా ఇంటింటి సర్వే నిర్వహిస్తారు. అనంతరం జూలై 21న ముసాయిదా (డ్రాఫ్ట్) ఓటర్ల జాబితాను విడుదల చేయడం జరుగుతుంది. ఆ తర్వాత ఓటర్ల నుంచి వచ్చే అభ్యంతరాల స్వీకరణ, వాటి పరిష్కార ప్రక్రియను పూర్తి చేసి, చివరగా సెప్టెంబర్ 22న తుది ఓటర్ల జాబితాను అధికారికంగా విడుదల చేస్తారు. జూన్ నుంచి సెప్టెంబర్ వరకు సాగే ఈ ఎస్ఐఆర్ ప్రక్రియ అత్యంత ప్రాధాన్యత కలిగినది కావడంతో, పార్టీ తరపున నియమించిన కమిటీలు, నియోజకవర్గ ఇన్ఛార్జ్లు ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని ఆయన ఆదేశించారు. ఈ ఓటర్ల సవరణ క్రతువులో బూత్ లెవల్ ఏజెంట్ల పాత్ర అత్యంత కీలకమని సజ్జల స్పష్టం చేశారు. బూత్ లెవల్ ఆఫీసర్లతో (దీూాం) నిరంతరం సమన్వయం చేసుకుంటూ, వైసీపీ సానుభూతిపరుల ఓట్లు ఎట్టి పరిస్థితుల్లోనూ జాబితా నుండి తొలగించబడకుండా డ్రాఫ్ట్ స్థాయిలోనే అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇందుకోసం బీఎల్ఏలకు త్వరలోనే ప్రత్యేక ఓరియెంటేషన్, శిక్షణ ఇస్తామని ప్రకటించారు. ఇది 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' కావడం వల్ల ఒకసారి ఓటు తొలగిస్తే మళ్లీ చేర్చడం చాలా కష్టమని, ఎన్యూమరేషన్ ఫామ్ ఇస్తేనే ఓటు భద్రంగా ఉంటుందనే విషయాన్ని క్షేత్రస్థాయిలో ఓటర్లకు వివరించి వారిని చైతన్యపరచాలన్నారు. ఈ సుదీర్ఘ ప్రక్రియలో సమర్థవంతంగా పనిచేసి, బాధ్యతలను నెరవేర్చే బీఎల్ఏలకు రాబోయే రోజుల్లో పార్టీలో తగిన గుర్తింపు, పురస్కారాలు తప్పకుండా ఉంటాయని సజ్జల రామకృష్ణారెడ్డి భరోసా ఇచ్చారు.

# ఏపీలో 16,000 ఇ-సైకిళ్లు..

**అమరావతి,, మే 18 (రిపబ్లిక్ న్యూస్):**

రాష్ట్రంలో ఇంధన పొదుపును ప్రోత్సహించడంతో పాటు, పర్యావరణ హితమైన రవాణాను ప్రోత్సాహించే దిశగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక అడుగు వేసింది. విద్యుత్ వాహనాల (ఈవీ) వినియోగాన్ని ఒక ఉద్యమంగా మార్చాలని, దీనికి అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. తొలి దశలో 16,000 ఎలక్ట్రిక్ సైకిళ్లను స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు కార్యాలయాల సిబ్బందికి అందించాలని నిర్ణయించారు. సోమవారం నాడు సచివాలయం నుంచి ఈవీ కంపెనీల ప్రతినిధులతో సీఎం చంద్రబాబు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎలక్ట్రిక్ సైకిళ్లు, వాహనాల వినియోగాన్ని పెద్ద ఎత్తున ప్రోత్సహించాలని దిశానిర్దేశం చేశారు. కార్యాలయ సిబ్బందికి అందించే 16,000 ఇ-సైకిళ్లను సులభ వాయిదాల (ఈఎంఐ) పద్ధతిలో ఇచ్చేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు.

సామాన్యులు కూడా ఈవీ వాహనాలను సులభంగా కొనుగోలు చేసేందుకు వీలుగా రుణాలు అందించేందుకు ఒక ప్రత్యేక స్పెషల్ పర్పస్ వెహికల్ (ఎస్పీవీ) ఏర్పాటు చేయాలని సీఎం స్పష్టం చేశారు. వాహనాలతో పాటు ఛార్జింగ్ స్టేషన్ల వంటి మౌలిక సదుపాయాల కల్పనపై కూడా దృష్టి సారించాలన్నారు. ఛార్జింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఉంటుందని కంపెనీ ప్రతినిధులకు హామీ ఇచ్చారు.

# బుల్లెట్ వేగంతో రాయల్ ఎన్ఫీల్డ్ ఫ్యాక్టరీ

**మొదటిపేజీ తరువాయి**

ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో రాయల్ ఎన్ఫీల్డ్ సంస్థ ప్రతినిధులు సోమవారం రాష్ట్ర సచివాలయంలో సమావేశమయ్యారు. రాయల్ ఎన్ఫీల్డ్ సంస్థ సీఈఓ గోవింద రాజన్ నేతృత్వంలోని బృందం సీఎంను మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా బుల్లెట్ మోటార్ సైకిల్ మోడళ్లను సీఎం పరిశీలించారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. బు÷-లలెట్ మోటార్ సైకిల్ తయారీ యూనిట్కు ఏపీ ప్రభుత్వం ప్రోత్సాహకాలను కల్పించటంపై ఆ సంస్థ ప్రతినిధులు సీఎంకు ధన్యవాదాలు తెలిపారు. తిరుపతి జిల్లా సత్యవేడు మండలం రాళ్లకుప్పం, వానల్లూరు గ్రామాల వద్ద రూ.2500 కోట్ల పెట్టుబడితో రాయల్ ఎన్ఫీల్డ్ తయారీ ఎ÷-లాంట్ ఏర్పాటు చేయనున్నట్లు కంపెనీ ప్రతినిధులు వెల్లడించారు. ఈ ప్రాజెక్టును వేగంగా పూర్తి చేసి 18 నెలల్లోనే ఉత్పత్తి ప్రారంభించాలని సూచించారు. రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణలో ప్రభుత్వం వేగంగా ముందుకెళ్తోందని సీఎం పేర్కొన్నారు. రాయల్ ఎన్ఫీల్డ్ వంటి అంతర్జాతీయ స్థాయి సంస్థలు ఏపీలో పెట్టుబడులు పెట్టడం రాష్ట్ర అభివృద్ధికి కీలకమని సీఎం చంద్రబాబు తెలిపారు. ఈ తయారీ యూనిట్లో అత్యాధునిక సదుపాయాలు ఏర్పాటు చేయనున్నట్లు ఆ కంపెనీ ప్రతినిధులు తెలిపారు. ప్రధాన తయారీ ఎ÷-లాంట్తో పాటు టెస్టింగ్ ట్రాక్, పరిశోధనా కేంద్రం, వెండార్ పార్క్ ఎకోసిస్టమ్ కూడా నిర్మించనున్నట్లు వెల్లడించారు. దీంతో రాష్ట్రంలో ఆటోమొబైల్ రంగానికి కొత్త ఊపు రానుందని భావిస్తున్నారు. ఈ ఎ÷-లాంట్ ద్వారా ఏడాదికి సుమారు 9 లక్షల మోటార్ సైకిళు ఉత్పత్తి చేయనున్నట్లు ఆ కంపెనీ ప్రతినిధులు తెలిపారు. అలాగే ఈ యూనిట్ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 15 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. రాయల్ ఎన్ఫీల్డ్ త్వరలో 'ఫ్లైయింగ్ ఫ్లీ అ6' పేరుతో ఎలక్ట్రిక్ వేరియంట్ మోడల్ను కూడా మార్కెట్లోకి తీసుకురానున్నట్లు ఆ సంస్థ ప్రతినిధులు సీఎంకు వివరించారు. భవిష్యత్తులో ఎలక్ట్రిక్ వాహనాల తయారీలో కూడా ఏపీ కీలక కేంద్రంగా మారే అవకాశం ఉందని ప్రతినిధులు పేర్కొన్నారు.

# కేబీఆర్ పార్క్ చుట్టూ చెట్ల నరికివేతపై స్టే

**మొదటిపేజీ తరువాయి**

చెట్ల నరికివేతపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ సుప్రీంకోర్టులో ఓ పిటిషన్ దాఖలైంది. సోమవారం జస్టిస్ నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్ ధర్మాసనం ముందు ఈ పిటిషన్పై విచారణ జరిగింది. పర్యావరణ ప్రేమికుల తరఫున సీనియర్ కౌన్సిల్ కె. వివేక్ రెడ్డి బలమైన వాదనలు వినిపించారు. చెట్ల నరికివేత వల్ల వస్తున్న పర్యావరణ నష్టాన్ని వివరించి, ప్రభుత్వ నిర్మాణ పనులపై స్టే విధించాలని కోర్టును కోరారు. దీంతో చెట్ల నరికివేతపై స్టే ఇచ్చిన సుప్రీంకోర్టు.. తదుపరి విచారణను జూలై 27కు వాయిదా వేసింది. సుప్రీంకోర్టు స్టే ఆదేశాలతో ఎస్ఆర్డీపీ పనులు తాత్కాలికంగా నిలిచిపోనున్నాయి. ప్రధానంగా కేబీఆర్ జంక్షన్ పరిసరాల్లో ఫ్లై ఓవర్ల నిర్మాణానికి భారీ ఆటంకం ఏర్పడింది.

# గడువులోగా ప్రాజెక్టులు

**మొదటిపేజీ తరువాయి**

ఈ మేరకు దిశానిర్దేశం చేశారు.

ఇటీవల కలెక్టర్ల సమావేశంలో 25 ప్రాజెక్టులతో ఇరిగేషన్ క్యాలెండర్ను ప్రకటించిన సీఎం, తాజా సమీక్షలో మరో 11 ప్రాజెక్టులకు ప్రాధాన్యతనిచ్చారు. ఈ 36 ప్రాజెక్టుల పనులను క్యాలెండర్ ప్రకారం పూర్తి చేయాలని, భూసేకరణ, నిధుల కొరత లేకుండా చూడాలని ఆర్థిక శాఖ అధికారులకు సూచించారు.

**పోలవరం, ఇతర ప్రాజెక్టులపై సీఎం ఆదేశాలు**

పోలవరం ప్రాజెక్టు పనుల పురోగతిపై ప్రతినెలా సమీక్ష నిర్వహిస్తానని సీఎం స్పష్టం చేశారు. ఎర్త్ కమ్ రాక్ ఫిల్ డ్యామ్ పనులను 2027 మార్చి 31 నాటికి, నిర్వాసితుల తరలింపును 2027 ఏప్రిల్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. పోలవరం స్పిల్ వే వద్ద పర్యాటక ఆకర్షణగా ఐకానిక్ బ్రిడ్జి నిర్మించాలని సూచించారు.

అలాగే వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశను ఈ ఏడాది జూలై నాటికి పూర్తి చేయాలని, హంద్రీ-నీవా కాలువ ద్వారా ఈ ఏడాదే నీరు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఖరీఫ్ సీజన్ ఆలస్యం కాకుండా కాల్వలకు నీటిని విడుదల చేయాలని, జలధార-జలహారతి కార్యక్రమాన్ని సమర్థంగా నిర్వహించాలని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో నిర్వీర్యమైన లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంలను పునరుద్ధరించి రైతులను ఆదుకోవాలని ముఖ్యమంత్రి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**ఇరిగేషన్ క్యాలెండర్లోని 36 ప్రాజెక్టుల వివరాలు:**

1. కాటన్ బ్యారేజ్ గేట్స్ (ఫౌండేషన్) - జూన్ 2026
2. పోలవరం ఎడమ ప్రధాన కాలువ - జూలై 2026
3. గుంటూరు ఛానల్ ఆధునీకరణ (ఫౌండేషన్) - జూలై 2026
4. వెలిగొండ ఫేజ్ - 1 - ఆగస్టు 2026
5. తుంగభద్ర కొత్త గేట్లు - జూన్ / జూలై 2026
6. హంద్రీ నీవా బ్రాంచ్ (ఫౌండేషన్) - ఆగస్టు 2026
7. గాలేరు నగరి (ఫౌండేషన్) - ఆగస్టు 2026
8. నేరడి బ్యారేజ్ (ఫౌండేషన్) - నవంబర్ 2026
9. మద్దువలస ఫేజ్-2 - జనవరి 2027
10. హీర మండలం ఎత్తిపోతల పథకం - ఏప్రిల్ 2027
11. నాగావళి - చంపావతి నదుల లింక్ - జూన్ 2027
12. పోలవరం ప్రాజెక్ట్ - జూన్ 2027
13. బుడమేరు ఫ్లడ్ ప్రొటెక్షన్ - జూన్ 2027
14. ముక్త్యాల ఎత్తిపోతల పథకం - జూన్ 2027
15. వంశధార ఫేజ్-2 స్టేజ్-2 (హిర మండలం బ్యారేజ్) - జూలై 2027
16. చింతలపూడి ఎత్తిపోతల పథకం ఫేజ్ 1 - జూన్ / జూలై 2027
17. హంద్రీ-నీవా ఫేజ్-2 (నీవా బ్రాంచ్ కెనాల్ వరకు) అక్టోబర్ 2026
18. తోటపల్లి డిస్ట్రిబ్యూటరీ - జూలై 2027
19. నీవా బ్రాంచ్ కెనాల్ (మూలపల్లి వరకు) జనవరి 2027
20. మూలపల్లి లిఫ్ట్ - డిసెంబర్ 2027
21. మడకశిర బ్రాంచ్ కెనాల్ వైడెనింగ్ - డిసెంబర్ 2027
22. ఝుంఝావతి రిజర్వాయర్ - డిసెంబర్ 2027
23. వేదవతి ఎత్తిపోతల పథకం - జూన్ 2028
24. భైరవాని తిప్ప - జూన్ 2028
25. అప్పర్ పెన్నార్ ప్రాజెక్ట్ - జూన్ 2028
26. జీఎన్ఎస్ఎస్ కెనాల్ (కడప వరకు) జూన్ 2028
27. సోమశిల-స్వర్ణముఖి లింక్ జూన్ 2028
28. శ్రీశైలం రైట్ మెయిన్ కెనాల్ వైడనింగ్ డిసెంబర్ 2028
29. తారక రామతీర్థ సాగర్ డిసెంబర్ 2027
30. మహేంద్ర తనయ జూలై 2027
31. గజపతినగరం బ్రాంచ్ కెనాల్ జూలై 2027
32. గాలేరు-నగరి (కడప, కోడూరు వరకు) డిసెంబర్ 2028
33. కోడూరు-బాలాజీ సాగర్ డిసెంబర్ 2028
34. గోదావరి డెల్టా మోడ్రనైజేషన్ జూన్ 2028
35. పెన్నా-సర్వేపల్లి డిసెంబర్ 2026

# నంద్యాల ప్రభుత్వ ఐ.టి.ఐ. నందు ప్రవేశములకు ఆన్‌లైన్ దరఖాస్తుల ఆహ్వానం.

**నంద్యాల మే 18 (రిపబ్లిక్ న్యూస్) :** నంద్యాల ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థలో (ప్రభుత్వ ఐ.టి.ఐ. నంద్యాల) ప్రవేశములకు ధరఖాస్తులు ఆహ్వానిస్తునట్లు కళశాల ప్రిన్సిపాల్ శ్రీ పి.ప్రసాద్ తెలిపారు. నంద్యాల ప్రభూత్వ ఐటిఐ లో చేరదలుచుకున్న విద్యార్థిని, విద్యార్థులు మే 15 వ తేది నుండి జూన్ 30 వ తేది రాత్రి 11:59 గంటల వరకు **itiadmissions.ap.gov.in/iti** అను వెబ్‌సైట్ లో ధరఖాస్తు చేసుకోగలరు. వెబ్‌సైట్ లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు జూలై 02 వ తేది సాయంత్రం 5:00 గంటల లోపు నంద్యాల ప్రభుత్వ ఐటిఐ నందు తమ సర్టిఫికేట్లు వెరిఫికేషన్ చేసుకోవాలని తెలిపారు. సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేయించుకున్న విద్యార్థులు జూలై 08 వ తేది నుండి జూలై 15 వ తేది తేదిలలో డోన్ ప్రభుత్వ ఐటిఐలో జరుగు కౌన్సిలింగ్ నకు విద్యార్థులు తమ ఓరిజినల్ సర్టిఫికేట్లతో హజరు కావాలని ప్రిన్సిపాల్ కోరారు. ఐ.టి.ఐ. విద్యార్హతతో కేంద్ర, రాష్ట్ర, ప్రభూత్వ మరియు ప్రవేట్ సంస్థల యందు అనేక ఉద్యోగ అవకాశాలు కలవు. 10 వ తరగతి పాస్ & ఫెయిల్ అయిన విద్యార్థులు అందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోగలరు.

**ఒక సంవత్సరం కోర్సులు**

1.మెకానిక్ డీజిల్2.వెల్డర్

**రెండు సంవత్సరాల కోర్సులు**

1. డ్రాఫ్ట్ మెన్ సివిల్ 2. ఎలక్ట్రీషియన్ 3. ఫిట్టర్ 4. రెఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్ కండిషనింగ్ టెక్

అడ్రెస్స్ : HP పెట్రోల్ బంక్ ఏదురుగా,
KC రోడ్ నూనెపల్లి నంద్యాల.
ప్రిన్సిపాల్ప్రభుత్వ ఐ.టి.ఐ. నంద్యాల
9866022452,9030657957,

# పెట్రోల్ - డీజిల్ రేట్లు తగ్గించండి

### ఆలూరు ఎమ్మెల్యే బుసినే వీరపాక్షి సోదరుడు బుసినే శ్రీరాములు






**చిప్పగిరి, మే, 18,( రిపబ్లిక్ న్యూస్)** పెట్రోల్, డీజిల్ రేట్లు వెంటనే తగ్గించాలని ఆలూరు ఎమ్మెల్యే బుసినే వీరుపాక్షి సోదరుడు బుసినే శ్రీరాములు సోమవారం ఆలూరు తాసిల్దార్ కార్యాలయం నందు వినతి పత్రం అందజేశారు, బుసినే శ్రీరాములు మాట్లాడుతూ ఎక్కడ లేని విధంగా ఇంధన ధరలు మన రాష్ట్రంలో ఎక్కువగా ఉన్నాయని, కూటమి ప్రభుత్వం ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తుందని వెంటనే పెట్రోల్, డీజిల్ రేట్లు తగ్గించాలని డిమాండ్ చేశారు, అనంతరం ప్రజలు, పార్టీ కార్యకర్తలు తో కలిసి నిరసన తెలిపారు, ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్పి నాయకులు మండల కన్వీనర్లు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, సీనియర్ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# కబ్జా భూములు వదలండి

## -అతిక్రమిస్తే కఠిన చర్యలే : తాసిల్దార్ యామిని రెడ్డి.





**రైల్వే కోడూరు మే 18 రిపబ్లిక్ న్యూస్.**

ఓబులవారిపల్లె మండలం వై కోట పంచాయతీ తిరుగుడుపల్లె దళితవాడకు సంబంధించిన రైతులకు గతంలో ప్రభుత్వం కేటాయించిన భూములను వారికే దక్కుతాయని వారి కడుపు కొట్టి అక్రమ మార్గంలో ఆక్రమించుకున్న అక్రమార్కులు వెంటనే ఆ భూములను వారికి వదిలిపోవాలని లేని పక్షంలో శాఖపరమైన కఠిన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఈ సందర్భంగా సోమవారం వారికి ఆమె హెచ్చరిక జారీ చేశారు, అంతకుముందు సిపిఐ మండల కార్యదర్శి చింతలపూరి నాగమ్మ ఆధ్వర్యంలో కామ్రేడ్ల కలిసి మండల కేంద్రం ఓబులవారిపల్లి తాసిల్దారు కార్యాలయం ఎదుట ఉదయం 11 గంటలకు నిరసన కార్యక్రమం చేశారు,

ఈ కార్యక్రమానికి భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ రైల్వే కోడూరు నియోజకవర్గ కార్యదర్శి జ్యోతి చిన్నయ్య . నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు దార్ల రాజశేఖర్ పాల్గొన్నారు, ఈ సందర్భంగా జ్యోతి చిన్నయ్య. చింతలపూరి నాగమ్మ. దార్ల రాజశేఖర్ మాట్లాడుతూ ఓబులవారిపల్లి మండలం ఎర్రగుంట కోట రెవెన్యూ గ్రామంలోని 1066/ సర్వేనెంబర్ లోని 557 ఎకరాల71 సెంట్లు ప్రభుత్వ భూమిని గతంలోనే భూ బకాసురులు మరియు భూ తిమింగలాలు కలిసి 520 ఎకరాలు అక్రమ మార్గంలో లక్షల రూపాయలు చేతులు మార్చి సక్రమము చేసుకొని దర్జాగా తిరుగుతుండగా, మిగులు భూమి 37 ఎకరాలను 2017 సంవత్సరంలో తిరుగుడుపల్లి దళిత గ్రామస్తులకు ఒక్కో కుటుంబానికి ఒక ఎకరం చొప్పున 27 కుటుంబాలకు 27ఎకరముల ప్రభుత్వ మిగులు భూమిని వారికి సక్రమమార్గంలో ప్రభుత్వం కేటాయించడం జరిగినది, అప్పటినుండి ఆ గ్రామ పేద దళితులు పెట్టుబడి లేమి కారణముగా అప్పుడప్పుడు అరకొర ఉలువ సజ్జ రాగి పెసర వర్షాధార పంటలను తరచూ పండించుకుంటూ చాలీచాలని ఆదాయముతో మరోపక్క కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటే, ఆకలి తీరని అడవి మృగాల్లా భూ బకాసురులు తిమింగలాలు మే 16వ తేదీన ఆభూములను కూడా మింగడానికి పగలను మరచి రాత్రి సమయాల్లో ,(భూదొంగలు కదా)భారీ యంత్రాల సహాయంతో వారి భూములను ఆక్రమించుకుని చదును చేసి కంచె వేసే ప్రయత్నం చేస్తుండగా సదరు భూ బాధిత దళితులు వారి జిత్తుల మరి తనాన్ని కనుక్కున్న గ్రామస్తులు వారి ప్రయత్నానికి అడ్డు తగలగా అడ్డు రాకండి మీకు దిక్కున చోట చెప్పుకోండి పొండి అని నోటికొచ్చినట్లు దుర్భాసలాడి వారిని బెదిరించగా దిక్కుతోచని స్థితిలో వారు కామ్రేడ్ల ఆశ్రయము త్వరగా వెంటనే స్పందించిన కామ్రేడ్లు సదరు భూమిలోనికి చేరుకొని వారిని ఆ భూమి నుండి తరిమి వేసి బాధితులకు సహాయంగా నిలిచినట్లు కామ్రేడ్లు తెలియజేశారు, నిరసన కార్యక్రమఅనంతరం తాసిల్దార్ యామిని రెడ్డికి వినతి పత్రం అందజేయగా స్పందించిన తాసిల్దార్ ఏమైనా రెడ్డి సంబంధిత భూముల దళితులకు న్యాయం చేస్తామని అక్రమార్కుల తాట తీస్తామని ఈ విషయమై పై అధికారులకు తెలియజేసి సత్వర న్యాయం జరిగేలా చూస్తామని ఆమె వారికి హామీ ఇవ్వడం జరిగినది, అనంతరం కామ్రేడ్ తాసిల్దార్ తో మాట్లాడుతూ దళితులకు న్యాయం జరగని పక్షంలో అన్ని ప్రజాసంఘాలను కలుపుకొని మీ కార్యాలయంను ముట్టడి చేస్తామనిఎదుటే ధర్నా చేయడం జరుగుతుందని తగిన న్యాయం చేస్తారని కోరుతున్నామన్నారు ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ సిద్దేశ్వర రావు, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ మల్లికార్జున రెడ్డి, డి హెచ్ పి ఎస్ జిల్లా నాయకులు కటారి గోపాల్ మరియు తలారి కన్నయ్య గ్రామస్తులు పాల్గొన్నారు.

# పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై భగ్గుమన్న బనగానపల్లె

## - మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ భారీ ర్యాలీ

### - ఆటోను తాళ్లతో లాగి వినూత్న నిరసన తహసిల్దార్‌కు వినతిపత్రం





**బనగానపల్లె, మే 18 రిపబ్లిక్ న్యూస్**

రాష్ట్రంలో పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలను తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేస్తూ బనగానపల్లె పట్టణంలో వైసీపీ శ్రేణులు నిరసనతో హోరెత్తించాయి. సోమవారం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు భారీ నిరసన ర్యాలీ చేపట్టారు. పట్టణంలోని తన స్వగృహం నుండి భారీ సంఖ్యలో తరలివచ్చిన కార్యకర్తలతో కలిసి కాటసాని రామిరెడ్డి ఇంచార్జి తహసిల్దార్ కార్యాలయం వరకు ప్రదర్శనగా వెళ్లారు. పెరిగిన ఇంధన ధరలకు నిరసనగా మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి స్వయంగా ఆటోకు తాళ్లు కట్టి, రోడ్డుపై లాగుతూ వినూత్నంగా నిరసన తెలిపారు. అనంతరం ఇంచార్జి తహసిల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా కాటసాని రామిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. ఎన్నికల ముందు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం, చెప్పింది ఒకటి.. చేస్తోంది మరొకటి అని మండిపడ్డారు. అమెరికా, ఇరాన్ యుద్ధాన్ని సాకుగా చూపిస్తూ ఇష్టానుసారంగా పెట్రోల్, డీజిల్ రేట్లు పెంచి రాష్ట్ర ప్రజల నడ్డి విరుస్తున్నారని విమర్శించారు. ముఖ్యంగా పెట్రోల్, డీజిల్, యూరియా ధరల పెంపు వల్ల రైతాంగంపై తీవ్ర ఆర్థిక భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పండిన పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు విలవిలలాడుతుంటే, పెట్టుబడి వ్యయాన్ని పెంచుతూ పోతే రైతులు బతికే పరిస్థితి లేదని అన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి, పెంచిన ధరలను తగ్గించాలని, పంటలకు గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అవుకు మండల వైఎస్సార్సీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి,జిల్లా యువజన అధ్యక్షుడు గుండం నాగేశ్వర్ రెడ్డి, వైఎస్సార్సీపీ నాయకులు చల్లా విక్రాంత్ రెడ్డి, గుండం నాగేశ్వర్ రెడ్డి,సిద్ధంరెడ్డి రామ్మోహన్ రెడ్డి,కునుకుంట్ల రామన్న,అంబటి రవిరెడ్డి,బండి బ్రహ్మానందరెడ్డి మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


# నేడు బీ.పీ. శేషారెడ్డి విగ్రహావిష్కరణ కార్యక్రమం



**బేతంచర్ల ప్రతినిధి, మే 18(పబ్లిక్ న్యూస్)**

బేతంచెర్ల డోన్ మాజీ ఎమ్మెల్యే రావు బహదూర్ శ్రీ బీ.పీ. శేషారెడ్డి 141వ జయంతి సందర్భంగా నూతన విగ్రహావిష్కరణ కార్యక్రమం.నేడు అనగా 19-05-2026 మంగళవారం సాయంత్రం 5:00 గంటలకు నిర్వహిస్తున్నట్లు వైసిపి ముఖ్య నాయకులు తెలిపారు. రాష్ట్రమాజీ ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ప్రముఖ పారిశ్రామిక వేత్త బుగ్గన సంజీవరెడ్డి లు శేషారెడ్డి విగ్రహంను ఆవిష్కరిస్తారు. అనంతరం శేషారెడ్డి స్కూల్లో ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేస్తున్న ఓపన్ జిమ్మును పరిశీలిస్తారు. కావున ఈ కార్యక్రమానికి బేతంచెర్ల మండల మరియు గ్రామ ప్రజలు, బుగ్గన అభిమానులు, శేషారెడ్డి హైస్కూల్ పూర్వ విద్యార్థులు పెద్ద ఎత్తున వచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయవలసిందిగా కోరుచున్నాము

# గ్రీవెన్స్ లో వచ్చిన అర్జీలను సత్వర పరిష్కారం చూపుతాం



**బేతంచర్లతహసీల్దార్ నాగమణి**

సోమవారం రోజునబేతంచెర్ల తహసీల్దార్ కార్యాలయం లో తహసీల్దార్ నాగమణి, ఎంపీడీఓ ఫజల్ రహమాన్ మరియు నగర పంచాయతీ కమిషనర్ హరి ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ నాగమణి మాట్లాడుతూ... ఈ వేదిక లో మండల ప్రజల, రైతుల నుండి మొత్తం 5 అర్జీలు వచ్చాయన్నారు . అందులో 1 అగ్రికల్చర్,1 ఎంపీడీఓ, 3 రెవిన్యూ వచ్చాయి అని ఆమె అన్నారు. వాటిని క్షేత్ర స్థాయిలో పరిశీలించి వాటిని సత్వర పరిష్కారం చూపుతామన్నారు. ఈ కార్యక్రమం లో డిప్యూటీ ఎంపీడీఓ పరమేశ్వర రెడ్డి, ఈ ఓ ఆర్ డి మల్లికార్జున, పంచాయతీ రాజ్ ఏ ఈ మహేష్, ఎం ఈ ఓ -2 అబ్రహం, ఏపీఎం మధు, ఏపీ ఓ విజయ రాణి ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పెట్రోల్ డీజిల్ ధరలను తగ్గించాలని సిపిఐ పార్టీ నిరసన




**గుత్తి మే 18 (రిపబ్లిక్ న్యూస్)**

గుత్తి పట్టణంలోని సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో పరమేశ్వరయ్య పెట్రోల్ బంక్ ఎదురుగా వినూత్న నిరసన. సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి,రాందాసు,పట్టణ కార్యదర్శి,రాజు,సీనియర్ నాయకులు రమేష్ బాబు,మహిళా సమైక్య నియోజకవర్గ నాయకురాలు,మహమ్మద, మాట్లాడుతూ ఇటీవల కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్,డీజిల్,వంట గ్యాస్ నిత్యావసర సరుకుల ధరలను వెంటనే ఉపసశీభరించుకోవలాని.గుత్తి, పరమేశ్వరయ్య పెట్రోల్ బంక్ ఎదురుగా పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి రామదాసు పట్టణ కార్యదర్శి రాజు,నియోజకవర్గ సీనియర్ నాయకులు రమేష్ బాబు,మండల సహాయ కార్యదర్శి వెంకటరాముడు,పట్టణ సహకార దర్శిలు నజీర్, మహ్మదా,ఏఐటీయూసీ,అమాలి నాయకులు,వినయ్,మల్లికార్జున, రమణ,దేవేంద్ర,ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు. నాగార్జున,ఆర్బి రామంజి,సీనియర్ నాయకులు డ్యానియల్, షఫీ,రామకృష్ణ భేస్తా శివకుమార్, మల్లికార్జున,గోపాల్,వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

# పెంచిన డీజిల్, పెట్రోల్, ఎరువుల ధరలను తక్షణమే తగ్గించాలి

## :-సిపిఎం, కాంగ్రెస్, ప్రజాసంఘాల నాయకులు




**పాములపాడు మే 18 రిపబ్లిక్ న్యూస్:-**పెంచిన పెట్రోల్, డీజిల్, రైతుల ఎరువుల ధరలు వెంటనే తగ్గించాలని, ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయానికి అవసరమైన డి ఏపి యూరియా కాంప్లెక్స్ రకాల ఎరువులను కొరత లేకుండా సరఫరా చేయాలని, ఎరువుల బ్లాక్ మార్కెట్‌ను అరికట్టాలని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి డి.స్వామన్న, రైతు సంఘం జిల్లా నాయకులు కోట్ల నాగేశ్వర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.షేక్షాఅలీ, సిఐటియు మండల కార్యదర్శి మేకల రాజు, సోషల్ వర్కర్ కలబండి.నాగరాజు, తదితర ప్రజాసంఘాల నాయకులు బస్టాండ్ లోని అంబేద్కర్ విగ్రహం దగ్గర నిరసన తెలిపి, డిమాండ్ చేశారు. ఈ సందర్భముగా వారు మాట్లాడుతూ యుద్ధం సాకు చూపి ఎరువుల కంపెనీలు ఎరువుల ధరలు పెంచి అన్నదాతల నడ్డి విరుస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇరాన్- అమెరికా ఇజ్రాయిల్ ల యుద్ధం ప్రభావంతో ఉత్పత్తి ఖర్చులు పెరిగితే కేంద్ర ప్రభుత్వం ఎరువులపై సబ్సిడీ ఇవ్వాలి తప్ప ధరలు పెంచడానికి అనుమతినివ్వడం రైతులను నిలువునా ముంచడమే తప్ప ఇంకొకటి కాదన్నారు. ఇప్పటికే పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెట్టుబడి పెట్టలేక అప్పులపాలవుతున్నా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు చీమకుట్టినైన స్పర్శ లేదని విమర్శించారు ప్రభుత్వ సహకార ప్రవేట్ రంగాలలోని కంపెనీలు ఎరువుల ధరలు పెంచకుండా కేంద్రం చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆయిల్ కంపెనీలు పెట్రోల్, డీజిల్ ధరలను లీటరుకు మూడు రూపాయలపైన పెంచాయని, మరోసారి దశల వారి పది రూపాయల వరకు పెట్రోల్, డీజిల్ ధరలు పెంచే అవకాశం ఉన్నట్లు తెలుస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం అవుతున్న ఈ సీజన్లో ఇప్పుడు ఎరువుల ధరలు పెరగడం వల్ల రైతును వ్యవసాయం నుండి బేధఖల్ చేయడమే అని అన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం అవుతుండగానే ఎరువుల ధరలు పెంచడం రైతాంగానికి మోయలేని భారమవుతుందన్నారు. ఒక్కో బస్తాకు రూ.125 నుండి 300లు పెంపుదల వలన రాష్ట్ర రైతాంగంపై రూ.800 కోట్ల భారం పడనున్నదని విచారం వ్యక్తం చేశారు. ఎరువుల దుకాణాల వ్యాపారులు ఇష్టారాజ్యంగా ఎరువుల ధరలు పెంచకుండా, బ్లాక్ మార్కెట్‌కు తరలించకుండా రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అవసరమైతే ఎరువుల సబ్సిడీని పెంచి, ఎరువుల ధరలు పెరగకుండా చూడాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో షేక్షావలి, మేకల రాజు, బాల యేసు చెన్నయ్య, సోషల్ వర్కర్ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

## 128 ఫిర్యాదులతో కర్నూలు పీజీఆర్ఎస్ హాట్‌టాపిక్..

### "చట్టపరంగా న్యాయం చేస్తాం" అన్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

**ఉద్యోగాల పేరుతో మోసాలు, భూవివాదాలు, కుటుంబ సమస్యలపై ప్రజల వినతులు..**

**వేగంగా విచారణ చేసి చర్యలు తీసుకుంటామని హామీ**





**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మే 18)**

కర్నూలు జిల్లాలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమానికి భారీ స్పందన లభించింది. కొత్తపేటలోని కర్నూలు టూ టౌన్ పోలీస్ స్టేషన్ పక్కన ఉన్న జిల్లా పోలీసు అధికారి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మొత్తం 128 ఫిర్యాదులు స్వీకరించబడినట్లు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ తెలిపారు.జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన బాధితులతో ఎస్పీ స్వయంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అందిన ప్రతి ఫిర్యాదుపై చట్ట ప్రకారం విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారంలో పోలీసు అధికారులు త్వరితగతిన స్పందించాలని ఆయన ఆదేశించారు.ఈ సందర్భంగా వచ్చిన ప్రధాన ఫిర్యాదుల్లో ఉద్యోగాల పేరుతో లక్షల రూపాయలు మోసం చేసిన ఘటనలు, భూవివాదాలు, కుటుంబ కలహాలు, అడ్వాన్స్ తీసుకుని ఇల్లు ఖాళీ చేయించిన ఘటనలు ప్రధానంగా ఉన్నాయి.డీఎస్సీ ఎస్జీటీ ఉద్యోగం ఇప్పిస్తామని రూ.16 లక్షలు తీసుకుని మోసం చేశారని ఏ.క్యాంపుకు చెందిన మహిళ ఫిర్యాదు చేయగా, హోంగార్డ్ ఉద్యోగాల పేరుతో మోసం జరిగిందని ఎలుకూరు బంగ్లాకు చెందిన వీరన్న గౌడ్ వినతి ఇచ్చారు. అలాగే మొక్కజొన్న విత్తనాల కొనుగోలు పేరుతో రూ.6.41 లక్షలు మోసం చేశారని కోడుమూరు మండలం ప్యాలకుర్తి గ్రామానికి చెందిన అబ్దుల్ షఫీ ఫిర్యాదు చేశారు.

కుటుంబ సమస్యలు, ఇంటి పట్టా వివాదాలు, భూమిలో అక్రమంగా బండలు పాతిపెట్టిన ఘటనలపై కూడా పలువురు ఎస్పీ దృష్టికి తీసుకువచ్చారు.ప్రతి ఫిర్యాదును సీరియస్‌గా తీసుకుని వేగంగా విచారణ పూర్తి చేసి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని ఎస్పీ విక్రాంత్ పాటిల్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ హుస్సేన్ పీరా, సీఐలు రామాంజులు, రామయ్య నాయుడు, పార్థసారథి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# చీని రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలి

### కలెక్టరేట్ వద్ద సిపిఐ, రైతు సంఘం ధర్నా -రోడ్డుపై ఎండిపోయిన చీని కాయలు చల్లి వినూత్న నిరసన

### రక్షిత తడులకు ఉచిత ట్యాంకర్లతో నీరు సరఫరా చేయాలని డిమాండ్

**అనంతపురం ప్రతినిధి, మే 18,( రిపబ్లిక్ న్యూస్ ):**

అనంతపురం జిల్లాలో తీవ్ర వర్షాభావం, నీటి ఎద్దడి కారణంగా ఎండిపోతున్న చీని తోటల రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని భారత్ కమ్యూనిస్టు పార్టీ డిమాండ్ చేసింది. భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ), ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం అనంతపురం కలెక్టరేట్ కార్యాలయం వద్ద భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు, నాయకులు ఎండిపోయిన చీని కాయలను రోడ్డుపై చల్లి ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా వినూత్నంగా నిరసన తెలిపారు.



**చీని చెట్లు కళ్లముందే**
**ఎండిపోతుంటే రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు**

ఈ ధర్నా కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పాల్యం నారాయణస్వామి, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిరుతల మల్లికార్జున మాట్లాడుతూ అనంతపురం జిల్లాను హార్టికల్చర్ హబ్‌గా అభివృద్ధి చేస్తామని, జ్యూస్ ఫ్యాక్టరీలు ఏర్పాటు చేస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం క్షేత్రస్థాయిలో రైతుల సమస్యలను పూర్తిగా విస్మరించిందని మండిపడ్డారు. రైతుల కష్టాలు తెలుసుకునే ప్రయత్నం కూడా ప్రభుత్వం చేయడం లేదని విమర్శించారు."పాపినిపాలెం వంటి గ్రామాల్లో బోర్లు అడుగంటిపోయాయి. తాగడానికి నీరు లేక మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. 7 నుంచి 8 ఏళ్లుగా పెంచుకున్న చీని చెట్లు కళ్లముందే ఎండిపోతుంటే రైతులు కన్నీరుమున్నీరవుతున్నారని వాపోయారు. 500 నుంచి 1000 అడుగుల లోతుకు బోర్లు వేసినా నీటి చుక్క కనిపించడం లేదు. మిడ్ పెన్నార్, హంద్రీనీవా నీళ్లు వచ్చాయని ప్రకటనలు ఇస్తున్నారు తప్ప, ఎక్కడా చెరువులు, కుంటలు నింపలేదు" అని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు.

**బాధిత రైతులకు నష్టపరిహారం వెంటనే విడుదల చేయాలి**

గ్రామాల్లో పశువుల దాహం తీర్చేందుకు రైతులు మండల కేంద్రాల నుంచి డబ్బులు పెట్టి మినరల్ వాటర్ కొనాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. రైతులు ప్రస్తుతం ఒక్కో వాటర్ ట్యాంకర్‌కు రూ.1500 నుంచి రూ.2000 వరకు ఖర్చు చేస్తున్నారని, కాబట్టి ప్రభుత్వం ఉచితంగా ట్యాంకర్ల ద్వారా రక్షిత తడులు అందించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి ఉద్యాన, వ్యవసాయ శాఖ అధికారులతో నష్టపోయిన తోటలపై కరువు అంచనా నివేదిక తయారు చేయించి, బాధిత రైతులకు ఆర్థిక ప్యాకేజీ లేదా నష్టపరిహారం వెంటనే విడుదల చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రామకృష్ణ, టి. నారాయణస్వామి, పద్మావతి, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు చెన్నప్ప యాదవ్, ఉపాధ్యక్షులు బండి రామకృష్ణ, పెద్దవడుగురు వెంకటరాముడు, లలితమ్మ, పార్వతీ ప్రసాద్, రమేష్, కుళాయి స్వామి, రూరల్ మండల కార్యదర్శి నరేష్, బుక్కరాయసముద్రం మండల కార్యదర్శి రామకృష్ణ, రాప్తాడు మండల కార్యదర్శి రవీంద్ర, కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాము, ఏఐవైఎఫ్ నాయకులు ధను, కుళ్లాయప్ప, రెడ్డప్ప తదితరులు పాల్గొన్నారు.

# కర్నూలులో రాజకీయ దుమారం..

## టీజీ కుటుంబంపై బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డి ఘాటు విమర్శలు

### "వైసీపీ కార్యకర్తలను వేధిస్తున్నారు.. తప్పుడు కేసులతో టార్గెట్ చేస్తున్నారు" అంటూ

### మంత్రి టీజీ భరత్, ఎంపీ శబరి, మాజీ ఎంపీ టీజీ వెంకటేష్‌లపై విమర్శల వర్షం

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మే 18)**

కర్నూలు జిల్లాలో రాజకీయ సమీకరణాలు రోజురోజుకు మరింత ఉద్రిక్తంగా మారుతున్నాయి. వైసీపీ నేత బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డి చేసిన సంచలన వ్యాఖ్యలు జిల్లా రాజకీయాల్లో కలకలం రేపుతున్నాయి. కర్నూలులోని తన స్వగృహంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన టీజీ కుటుంబాన్ని నేరుగా టార్గెట్ చేస్తూ తీవ్ర విమర్శలు గుప్పించారు.వైసీపీ కార్యకర్తలు, నాయకులను ఉద్దేశపూర్వకంగా వేధిస్తూ తప్పుడు కేసులు బనాయిస్తున్నారని ఆరోపించిన సిద్ధార్థ్ రెడ్డిడ "ప్రశ్నిస్తే నన్నే టార్గెట్ చేస్తున్నారు" అంటూ మండిపడ్డారు. మంత్రి టీజీ భరత్ రాజకీయ కక్ష సాధింపుతో అమాయకులపై కేసులు పెట్టిస్తున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు.

"నన్ను విమర్శించేందుకే బైరెడ్డి శబరికి ఎంపీ పదవి ఇచ్చారా?" అంటూ ప్రశ్నించిన ఆయనడ తన తండ్రి బైరెడ్డి రాజశేఖర్ రెడ్డిపై విమర్శలు వచ్చినప్పుడు ఎందుకు స్పందించలేదని నిలదీశారు. మహిళపై వ్యాఖ్యలు చేశానంటూ తనపై తప్పుడు ప్రచారం చేసి రాజకీయ లబ్ధి



పొందాలని చూస్తున్నారని ఆరోపించారు."నా వెనుక గంజాయి బ్యాచ్ ఉందంటున్నారుడ మీ వెనుక ఉన్నవారు ఎవరో ప్రజలకు తెలుసు" అంటూ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డ సిద్ధార్థ్ రెడ్డిడ కొంతమందిపై మర్డర్ కేసులు ఉన్న విషయం నిజం కాదా అని ప్రశ్నించారు. ఈ వ్యాఖ్యలు సమావేశంలో తీవ్ర చర్చకు దారితీశాయి.

మాజీ ఎంపీ టీజీ వెంకటేష్‌పై కూడా ఆయన ఘాటు వ్యాఖ్యలు చేశారు. "ఒకప్పుడు వెంకటేష్ పై గౌరవం ఉండేదిడ కానీ ఇప్పుడు ఆ గౌరవం పూర్తిగా పోయింది" అని అన్నారు. ఆల్కలిస్ ఫ్యాక్టరీ కారణంగా ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్న విషయం అందరికీ తెలుసని ఆరోపించారు."డబ్బులు ఇచ్చి ఎవరితో మాట్లాడించినా నేను భయపడనుడ బెదిరింపులకు తలొగ్గేది లేదు" అంటూ స్పష్టం చేసిన సిద్ధార్థ్ రెడ్డిడ తమ పార్టీలోనే కొంతమంది కోవర్టులు పనిచేస్తున్నారని సంచలన ఆరోపణలు చేశారు. ఈ మొత్తం వ్యవహారాన్ని వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానన్నారు.

ఇటీవల కర్నూలులో జరిగిన వైసీపీ కార్యకర్త మృతిపై కూడా ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ ఘటనకు కారణమైన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టబోమని హెచ్చరించారు. బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డి చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం కర్నూలు రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపుతున్నాయి.

## పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై వైసీపీ ఆందోళన

### ఆర్డీఓ కార్యాలయం ఎదుట బైఠాయింపు

**అనంతపురం సంక్షేమం, మే 18,( రిపబ్లిక్ న్యూస్ ):**



పెట్రోల్, డీజిల్ ధరల పెంపును నిరసిస్తూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమవారం అనంతపురం నగరంలో ఆందోళన చేపట్టారు. నగరంలోని లలిత కళాపరిషత్ నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి అక్కడ బైఠాయించారు. కార్యక్రమంలో సీనియర్ వైసిపి నాయకులు చంద్రారెడ్డి, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బోయగిరిజమ్మ, డిప్యూటీ మేయర్ కొగటం విజయభాస్కర్ రెడ్డి, డిప్యూటీ వాసంతి,మహాలక్ష్మి శ్రీనివాస్, విద్యార్థి విభాగం నాయకులు చంద్రశేఖర్ యాదవ్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఇంధన ధరల పెంపును వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీఓ కేశవ నాయుడు కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా వైసీపీ నాయకులు మాట్లాడుతూ దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లోనే పెట్రోల్, డీజిల్ ధరలు అధికంగా ఉన్నాయని విమర్శించారు. ఇంధన ధరల పెరుగుదలతో నిత్యావసర వస్తువుల ధరలు కూడా అమాంతం పెరిగిపోయాయని, దీంతో పేద, మధ్యతరగతి ప్రజల జీవనం భారంగా మారిందని మండిపడ్డారు.అధికారంలోకి వస్తే పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గిస్తామని ఎన్నికల సమయంలో ప్రచారం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్‌లు అధికారంలోకి వచ్చిన తర్వాత ధరలను తగ్గించకపోగా మరింత పెంచేశారని ఆరోపించారు. పెరిగిన ఇంధన ధరల కారణంగా రాష్ట్ర ప్రజలపై ఏటా సుమారు రూ.3,600 కోట్ల అదనపు భారం పడుతోందని పేర్కొన్నారు. తక్షణమే పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


## జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకోవాలి

### కలెక్టర్, జిల్లా పర్యాటక కౌన్సిల్ చైర్మన్ ఓ.ఆనంద్

**అనంతపురము, మే 18:**



జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకోవాలని కలెక్టర్ మరియు జిల్లా పర్యాటక కౌన్సిల్ చైర్మన్ ఓ.ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా పర్యాటక అభివృద్ధి కౌన్సిల్ సమావేశాన్ని జిల్లా పర్యాటక ప్రమోషన్ కౌన్సిల్ చైర్మన్ హోదాలో జిల్లా కలెక్టర్ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పర్యటక రంగ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. కొనకొండ్ల వద్దనున్న జైనుల జంబుద్వీప చక్రం అభివృద్ధి కోసం చర్యలు చేపట్టాలని, దీనిపై జైనులతో ఆర్కియాలజీ అధికారులు సమావేశం నిర్వహించాలన్నారు. నగరంలోని శిల్పారామంలో మాస్టర్ ప్రణాళిక ప్రకారం అభివృద్ధి పనులు చేయించాలని, అక్కడ అవసరమైన చేతివృత్తులు, ఫుడ్ కోర్ట్ లు ఏర్పాటు చేయాలన్నారు. కుందుర్పి కోటకు సంబంధించి మెట్ల నిర్మాణం ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనల కోసం సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకొని పనిచేయాలని ఆదేశించారు. కొండమీద రాయుడు కొండ చుట్టూ గిరి ప్రదర్శన కోసం, నేషనల్ పార్క్ లో వాకింగ్ ట్రాక్ ఏర్పాటుపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని అన్ని దేవాలయాల్లో, పర్యాటక ప్రాంతాల్లో అవసరమైన చోట మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నగరంలో చరిత్రాత్మక ప్రదేశాలు, స్థలాలను గుర్తించడం జరగగా, ఆయా ప్రాంతాల్లో నగరపాలక సంస్థ అధికారులతో కలిసి చరిత్ర తెలిపే విధంగా నేమ్ బోర్డులను ఏర్పాటు చేయడం చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధికి పుష్కల అవకాశాలు ఉన్నాయని, దృష్టి సారించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా పర్యాటక అధికారి ఓబులమ్మ, డ్వామా పిడి సలీం భాష, జడ్పీ సీఈవో విజయలక్ష్మి, నగర పాలక సంస్థ కమిషనర్ జశ్వంత్ రావు, మెప్మా పిడి విశ్వజ్యోతి, డీఈవో ప్రసాద్ బాబు, డిపిఓ నాగరాజు నాయుడు, ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జున ప్రసాద్, ఎస్ఈ రాజశేఖర్, ఈఈ షాకిర్, పర్యాటక శాఖ సిబ్బంది దీపక్, సాయి కిరణ్, కమిటీ సభ్యులు, ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



# అధికారుల తీరు ప్రజలకు నమ్మకం కలిగించేలా ఉండాలి

**ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి సమస్యలు పరిష్కరించాలి**

**జిల్లా రీఓపెన్ శాతాన్ని తగ్గించేందుకు ప్రత్యేక చర్యలు**

**పీజీఆర్ఎస్ ద్వారా 321 అర్జీలు స్వీకరణ**

**జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా**

**నంద్యాల బ్యూరో, మే 18 (రిపబ్లిక్ న్యూస్):**

ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులను అధికారులు సానుకూల దృక్పథంతో పరిశీలించి, ఫిర్యాదుదారులతో నేరుగా చరవాణి ద్వారా మాట్లాడి సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో నిర్వహించిన ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమం అనంతరం వివిధ శాఖల పనితీరుపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో డీఆర్వో రామునాయక్, పీజీఆర్ఎస్ నోడల్ అధికారి ఉమామహేశ్వరి, ఆర్డీఓలు మరియు ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి కార్యాలయ ఆదేశాల మేరకు ప్రజా ఫిర్యాదులపై సంబంధిత శాఖ అధికారులు ఫోన్ ద్వారా మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఇప్పటివరకు వ్యవసాయ, పంచాయతీరాజ్, పోలీసు, రెవెన్యూ, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ, వాటర్ రిసోర్సెస్, ఆర్టీసీ, సమగ్ర శిక్ష, స్వర్ణగ్రామ్-స్వర్ణవార్డ్, ఐసీడీఎస్, సాంఘిక సంక్షేమం, ఆర్ అండ్ బీ శాఖల అధికారులు మాత్రమే ఫిర్యాదుదారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించినట్లు తెలిపారు. మిగిలిన శాఖల అధికారులు కూడా ఇదే విధానాన్ని అనుసరించడంలో ఎందుకు విఫలమవుతున్నారని కలెక్టర్ ప్రశ్నించారు. ఫిర్యాదుదారులకు ఇచ్చే ఎండార్స్‌మెంట్‌లు స్పష్టంగా, ప్రజలకు అర్థమయ్యే సరళమైన తెలుగు భాషలో ఉండాలని సూచించారు. "సంబంధం లేదు" వంటి నిర్లక్ష్య సమాధానాలు ఇవ్వకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కలెక్టర్ ఆదేశించారు. ఆంగ్ల భాషలో సమాధానాలు ఇవ్వడం వల్ల గ్రామీణ ప్రజలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. పాములపాడు మండలానికి చెందిన ఒకే ఫోటోను పది రకాల అర్జీలకు అప్‌లోడ్ చేయడంపై కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. "వన్ మంత్ ఫోర్ విజిట్" కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గ స్థాయిలో ప్రజా సమస్యలను సమగ్రంగా పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్






తెలిపారు. ఈ క్రమంలో గత శుక్రవారం ఆళ్లగడ్డలో నిర్వహించిన ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 578 అర్జీలు అందినట్లు చెప్పారు. వాటిని 88 మంది అధికారులకు పంపించామని, ప్రతి అర్జీని క్షేత్రస్థాయిలో పరిశీలించి పూర్తిస్థాయిలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన అనుమతులు, ధ్రువపత్రాలు కూడా వేగంగా జారీ చేయాలని సూచించారు. ఇంధన పొదుపు చర్యల్లో భాగంగా మే 22న ఆళ్లగడ్డలో నిర్వహించే ప్రత్యేక ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమానికి అధికారులు వ్యక్తిగత వాహనాల్లో కాకుండా జిల్లా రవాణా అధికారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే ప్రత్యేక బస్సులో హాజరుకావాలని కలెక్టర్ ఆదేశించారు. సీఎం అర్జీల పరిష్కారంలో రీఓపెన్ శాతం తగ్గించేందుకు అధికారులు మరింత బాధ్యతతో వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. ముఖ్యమంత్రి స్థాయిలో రీఓపెన్ శాతం 17.7గా, ఉప ముఖ్యమంత్రి స్థాయిలో 15.29గా ఉండగా, జిల్లాలో ప్రస్తుతం 9.4 శాతం ఉందని తెలిపారు. దీన్ని 5 శాతానికి తగ్గించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

**రెవెన్యూ క్లినిక్స్ ద్వారా 162 అర్జీల స్వీకరణ**

భూ సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రెవెన్యూ క్లినిక్స్ ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా మారుతున్నాయని జిల్లా కలెక్టర్ తెలిపారు. రెవెన్యూ క్లినిక్స్ ద్వారా ఇప్పటివరకు 162 దరఖాస్తులు స్వీకరించినట్లు వెల్లడించారు. వాటిలో రెవెన్యూ, గ్రామ/వార్డు సచివాలయ సేవలకు సంబంధించినవి 9, అడంగల్ సవరణలకు సంబంధించినవి 35, చుక్కల భూముల క్రమబద్ధీకరణ మరియు 22-ఏ భూములకు సంబంధించినవి 14, అసైన్డ్ భూములు మరియు భూ ఆక్రమణలకు సంబంధించినవి 27, రెవెన్యూ కోర్టు విచారణలు మరియు ఆర్ఓఆర్ అంశాలకు సంబంధించినవి 26, సర్వే మరియు రీ-సర్వేలకు సంబంధించినవి 47, దేవాదాయ మరియు వక్ఫ్



భూములకు సంబంధించినవి 4 అర్జీలు ఉన్నాయని వివరించారు.

**పీజీఆర్ఎస్ ద్వారా స్వీకరించిన సమస్యలు**

నంద్యాల మండలం పొన్నాపురం కాలనీకి చెందిన మల్లెల కుమారి గత 25 సంవత్సరాలుగా అదే గ్రామంలో నివసిస్తున్నప్పటికీ తనకు స్వంత ఇల్లు లేదని, స్థలం కేటాయించాలని కోరుతూ కలెక్టర్‌కు వినతి సమర్పించారు.

పాణ్యం మండలంలోని 172 రైల్వే గేట్ సమీప ప్రాంత రైతులు జిందాల్ పరిశ్రమకు సంబంధించిన బొగ్గు రవాణా వల్ల బొగ్గు ధూళి వ్యవసాయ భూములపై పడుతూ పంట దిగుబడులు తగ్గుతున్నాయని, సాగునీరు కూడా కలుషితమవుతోందని ఫిర్యాదు చేస్తూ తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

నంద్యాల మండలం నూనెపల్లె గ్రామానికి చెందిన ఆర్. లక్ష్మిరెడ్డి తనకు చెందిన పొలానికి వెళ్లే దారిని పక్క భూమి యజమానులు నిరోధిస్తున్నారని, సమస్యను పరిష్కరించాలని కలెక్టర్‌కు అర్జీ సమర్పించారు. అనంతరం ముగ్గురు అర్జీదారులకు జిల్లా కలెక్టర్ స్వయంగా ఫోన్ చేసి, వారి సమస్యలు పరిష్కరించబడిన విధానం, అందిన సేవలపై సంతృప్తి ఉందా లేదా అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు.

రిపబ్లిక్
మంగళవారం19 మే 2026

# పెరిగిన పెట్రోల్ డీజిల్ ధరలకు వ్యతిరేకంగా

## కాటసాని రాంభూపాల్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం

**కల్లూరు తాసిల్దార్ కు వినతి పత్రం వచ్చిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కాటసాని రాంభూపాల్ రెడ్డి కాటసాని శివ నర్సింహారెడ్డి,నాయకులు**




**కల్లూరు ప్రతినిధి, మే 18(రిపబ్లిక్ న్యూస్)** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలకు వ్యతిరేకంగా నంద్యాల జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాటసాని రామభూపాల్ రెడ్డి మరియు వైఎస్ఆర్సీపీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు కాటసాని శివ నరసింహారెడ్డి ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం వినూత్న రీతిలో నిర్వహించబడింది. కాటసాని రామభూపాల్ రెడ్డి నివాసం వద్ద నుండి ప్రారంభమైన ఈ నిరసన ర్యాలీ ఎద్దుల బండ్లపై, ఆటోలను లాగుతూ ప్రజల దృష్టిని ఆకర్షించే విధంగా సాగి కల్లూరు తహసీల్దార్ కార్యాలయం వరకు చేరుకుంది. అనంతరం కల్లూరు తహసిల్దార్ కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాటసాని రామభూపాల్ రెడ్డి మాట్లాడుతూ..ఎన్నికల ముందు పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గిస్తామని హామీలు ఇచ్చిన చంద్రబాబు ప్రభుత్వం, అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలను మోసం చేస్తోందని తీవ్రస్థాయిలో విమర్శించారు. రాష్ట్రంలో ప్రస్తుతం పెట్రోల్ ధర రూ.113.62, డీజిల్ ధర రూ.101.24కి చేరడం వెనుక ప్రభుత్వ అధిక వ్యాట్ విధానమే కారణమని మండిపడ్డారు. పెరిగిన ఇంధన ధరల కారణంగా రాష్ట్ర ప్రజలపై ఏటా సుమారు రూ.3,391 కోట్ల అదనపు భారం పడుతోందని, గత వైఎస్సార్సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను రద్దు చేసి, ఇప్పుడు ధరల పెంపుతో ప్రజల నడ్డి విరుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో వ్యాట్ తగ్గిస్తామని చెప్పిన చంద్రబాబు, నారా లోకేష్ ఇప్పుడు ఆ హామీలను పూర్తిగా విస్మరించి, “సైకిళ్లు వాడండి, కార్ పూలింగ్ చేయండి” అంటూ ప్రజలకే సూచనలు ఇవ్వడం వారి ద్వంద్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. అనంతరం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు కాటసాని శివ నరసింహారెడ్డి మాట్లాడుతూ.. పెట్రోల్, డీజిల్ ధరల పెంపుతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రవాణా ఖర్చులు పెరగడంతో నిత్యావసర వస్తువుల ధరలు కూడా అమాంతం పెరిగిపోయాయని తెలిపారు. ప్రజలకు మేలు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం, ఇప్పుడు ప్రజలపై భారాలు మోపుతూ వారి జీవనాన్ని కష్టాల్లోకి నెట్టేస్తోందని మండిపడ్డారు. ప్రజలకు ఉపశమనం కల్పించాలంటే వెంటనే ఇంధన ధరలపై విధిస్తున్న అధిక వ్యాట్ తగ్గించాలని, లేదంటే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజల తరఫున మరింత ఉధృతంగా ఉద్యమాలు కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ భారీ ధర్నా కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో నిరసన వ్యక్తం చేశారు

# పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై వైఎస్సార్సీపీ ఆందోళన

**ధరలు వెంటనే తగ్గించాలని ప్రభుత్వానికి డిమాండ్.. తహసీల్దార్‌కు వినతిపత్రం**






**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మే 18)** పెట్రోల్, డీజిల్ ధరల పెంపును నిరసిస్తూ వైఎస్సార్సీపీ నాయకులు కర్నూలు నియోజకవర్గంలో ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఎస్వీ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర మహిళా విభాగ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.వి. విజయ మనోహరి ఆధ్వర్యంలో ఈ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఎన్నికల ముందు నారా చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ పెట్రోల్, డీజిల్ ధరలను పెంచబోమని, అవసరమైతే తగ్గిస్తామని హామీలు ఇచ్చారని గుర్తు చేశారు. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత మాట తప్పి రాష్ట్ర ప్రజలపై అదనపు భారం మోపుతున్నారని విమర్శించారు. దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లోనే పెట్రోల్, డీజిల్ ధరలు అధికంగా ఉన్నాయని పేర్కొంటూ నాయకులు నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం మంత్రాలయం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించి, ఇంధన ధరలను వెంటనే తగ్గించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ కర్నూలు పార్లమెంట్ సమన్వయకర్త బుట్ట రేణుక, నియోజకవర్గ నాయకులు, మహిళా నాయకులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అభివృద్ధి చూసి తెలుగుదేశం వైపు వైఎస్ఆర్పి నాయకులు

**ఆలూరు నియోజకవర్గం ఇంచార్జ్ వైకుంఠం జ్యోతి**





**చిప్పగిరి, మే, 18,( రిపబ్లిక్ న్యూస్)** ఆలూరు నియోజకవర్గం అభివృద్ధిని చూసి తెలుగుదేశం వైపు వైఎస్సార్ నాయకులు తెలుగుదేశం వైపు మొగ్గు చూపుతున్నారని సోమవారం వైకుంఠం జ్యోతి తెలిపారు,మర్యాదపూర్వకంగా కలిసిన చిప్పగిరి గ్రామ వైయస్సార్సీపి నాయకులు,కార్యకర్తలు ఆలూరు ఆలూరు టిడిపి ఇంచార్జ్ వైకుంఠం జ్యోతి నీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వైకుంఠం శివప్రసాదులను చిప్పగిరి గ్రామ వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు మర్యాదపూర్వకంగా కలిశారు, వైకుంఠం జ్యోతి నివాసంలో బెల్డోన సొసైటీ బ్యాంక్ చైర్మన్ కొండా రామాంజనేయులు,మండల టిడిపి కన్వీనర్ కొండా పురుషోత్తం ఆధ్వర్యంలో చిప్పగిరి మండల వైయస్సార్సీపి యూత్ అధ్యక్షులు కొండా పెద్దన్న తో పాటు చిప్పగిరి గ్రామ వైఎస్సార్సీపీ ముఖ్య నాయకులు ఇంచార్జ్ వైకుంఠం జ్యోతిని వైకుంఠం శివప్రసాద్ లను కలిసి పూలమాలలు,శాలావాళ్లతో ఘనంగా సన్మానించారు. నియోజకవర్గ అభివృద్ధికి తీవ్రంగా శ్రమిస్తున్న ఆలూరు టిడిపి ఇన్చార్జ్ వైకుంఠం జ్యోతి కృషిని అభినందిస్తూ,త్వరలో టిడిపి పార్టీలో చేరుతున్నట్లు వారు వివరించారు. ఈ కార్యక్రమంలో కొండా చికెన్ పెద్దన్న,కొండా రామాంజిని,గోపాల్,ఎల్లప్ప,రాజు, గోవిందప్ప,రాము,కృష్ణమూర్తి,తదితరులు పాల్గొన్నారు.

# గుర్తు తెలియని వ్యక్తి మృతి



**గుత్తి మే 18 (రిపబ్లిక్ న్యూస్)** అనంతపురం గుత్తి మండలం బసినేపల్లి గ్రామ సమీపంలో ఒక గుర్తుతెలియని వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. స్థానికులు ముళ్లపొదల్లో మృతదేహాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతికి గల కారణాలు, మృతుడి వివరాలను పోలీసులు ఆరా తీశారు. గుత్తి పోలీస్ స్టేషన్ కేసు నమోదు చేశారు గుర్తు తెలియని వ్యక్తి యొక్క వివరాలు తెలిసిన యెడల గుత్తి సీఐ 9346010582 ఎస్సై 9346917082 నెంబర్ కి తెలియజేయవలసిందిగా గుత్తి సీఐ రామారావు ఎస్సై సురేష్ తెలియజేశారు.

# శకునాల గ్రామ చెరువు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి






**ఓర్వకల్లు ప్రతినిధి, మే 18(రిపబ్లిక్ న్యూస్)** ఓర్వకల్లు మండలం శకునాల గ్రామంలో సోమవారం రోజున చెరువు అభివృద్ధికి సంబంధించిన పలు పనులకు పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు ఉపాధి కూలీలతో మాట్లాడడం జరిగింది ఉదయం పూట తొందరగా పనికి వచ్చి ఎండ వచ్చేలోపు ఇంటికి వెళ్లాలని వారు చెప్పారు, ఎండలు ఎక్కువగా ఉండడంతో కూలీలకు వారు తెలియజేయడం జరిగింది, శకునాల గ్రామం చాలా అభివృద్ధి చెందుతుందని వారు చెప్పారు ఎందుకంటే సోలార్ ప్రాజెక్ట్ మరికొన్ని కంపెనీలు మీ గ్రామ సమీపంలో ఉండడం వలన గ్రామము చాలా అభివృద్ధి చెందుతుందని వారు తెలియజేశారుఈ కార్యక్రమంలో ఎమ్మార్వో, ఎంపీడీవో, మండల కన్వీనర్ నాగిరెడ్డి, శకునాల హరికృష్ణ గౌడ్, మురళీధర్ రెడ్డి తదితర టీడీపీ నాయకులు పాల్గొన్నారు. గ్రామ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని నాయకులు తెలిపారు.

# గిరిజన హ్యాబిటేషన్ల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ ప్రారంభం

**ప్రజా సమస్యల పరిష్కారానికి “జన సునవాయి” కార్యక్రమాలు -గ్రామాల అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం తప్పనిసరి : కలెక్టర్ రాజకుమారి**




**నంద్యాల బ్యూరో, మే 18 (రిపబ్లిక్ న్యూస్):** గిరిజన మరియు వెనుకబడిన హ్యాబిటేషన్ల సమగ్ర అభివృద్ధి, ప్రభుత్వ సంక్షేమ పథకాల సమర్థ అమలు లక్ష్యంగా జిల్లాలోని 14 మండలాల్లో ఎంపిక చేసిన 48 హ్యాబిటేషన్లలో మే 18 నుండి 25వ తేదీ వరకు జన్ - భాగిరదీ కార్యక్రమం నిర్వహించబడుతుందని కలెక్టర్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్లోని పీజీఆర్ఎస్ హాలులో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ అనంతరం కార్యక్రమాన్ని నిర్వహణపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ, జిల్లాలోని 14 మండలాలకు చెందిన 48 హ్యాబిటేషన్లలో “జన్-భాగీదారి” కార్యక్రమాన్ని మే 18 నుండి 25వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. పీఎం జన్మన్ మరియు దజ్ గోవా గ్రామాల సమగ్ర అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకుని ప్రతి రోజు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో కార్యక్రమాలను అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. మే 19న అన్ని గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి, రాబోయే రోజుల కార్యక్రమాలపై గ్రామస్తులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే “జన సునవాయి” కార్యక్రమం నిర్వహించే ప్రదేశాలను ముందుగానే నిర్ణయించి, గ్రామ పెద్దలు మరియు ప్రజలకు సమాచారం అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మే 20న గ్రామాల్లో “ట్రాన్సెక్ట్ వాక్” నిర్వహించి డ్రైనేజీ, పారిశుద్ధ్యం, ప్లాంటేషన్, తాగునీరు వంటి సమస్యలను గుర్తించి నమోదు చేయాలని అధికారులకు ఆదేశించారు. పీడీ డ్వామా, ఏపీవోలు, మండల స్థాయి అధికారులు గ్రామాన్ని పూర్తిగా సందర్శించి ప్రజల అవసరాలను క్షేత్రస్థాయిలో తెలుసుకోవాలని పేర్కొన్నారు. మే 21 నుండి 23 వరకు సచివాలయాలు లేదా ఎంపీడీవోలు నిర్ణయించిన ప్రదేశాల్లో “జన సునవాయి” కార్యక్రమాలు నిర్వహించి గ్రామస్తుల ఫిర్యాదులు, సమస్యలను స్వీకరించాలని తెలిపారు. ఈ సందర్భంగా హౌసింగ్ పథకాల పురోగతి, ప్రారంభం కాని ఇళ్ల వివరాలు, ఆధార్ కార్డులు, ఉపాధి హామీ కార్డులు, ఆయుష్మాన్ భారత్ కార్డుల అవసరాలను గుర్తించి త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ప్రతి హ్యాబిటేషన్‌కు నియమితులైన ఇంచార్జ్ అధికారులు తమ బృందాలతో కలిసి వచ్చిన ఫిర్యాదులు, తీసుకున్న చర్యలపై సమగ్ర నివేదిక సిద్ధం చేసి ఎంపీడీవోలు, జిల్లా అధికారులకు సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. మే 25న జిల్లా వ్యాప్తంగా వచ్చిన మొత్తం ఫిర్యాదులపై సమీక్ష నిర్వహించి నివేదికను డైరెక్టరేట్ ఆఫ్ ట్రైబల్ వెల్ఫేర్ మరియు భారత ప్రభుత్వానికి పంపనున్నట్లు కలెక్టర్ తెలిపారు. మే 19 నుండి 25 వరకు డిప్యూటీ డీఎంహెచ్ఓల పర్యవేక్షణలో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించాలన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు “జన్ భాగీదారి” స్ఫూర్తితో కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పనుల పురోగతికి సంబంధించిన ఫోటోలు, వివరాలను నిరంతరం అప్‌లోడ్ చేయాలని అధికారులను ఆదేశించారు. ఆళ్ల గడ్డ, బనగానపల్లి, డోన్, నంద్యాల నియోజకవర్గాలకు యానిమల్ హాస్టళ్లు మంజూరైనట్లు కలెక్టర్ తెలిపారు. ఉపాధి హామీ మరియు పశుసంవర్ధక శాఖల సమన్వయంతో పనులు త్వరితగతిన ప్రారంభించాలని ఆదేశించారు. పాణ్యం, శ్రీశైలం, నందికొట్కూరు ప్రాంతాల్లో తగిన స్థలాల గుర్తింపుపై చర్యలు చేపట్టాలని సంబంధిత తాసిల్దార్లను కలెక్టర్ ఆదేశించారు. పశువుల హాస్టళ్ల నిర్వహణను గ్రామపంచాయతీలు లేదా డ్వాక్రా సంఘాల ద్వారా చేపట్టే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. బయోగ్యాస్ ప్లాంట్ల ఏర్పాటు ద్వారా విద్యుత్, వీధి దీపాల నిర్వహణలో ఇంధన పొదుపు సాధించే అవకాశాలపై దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. శాశ్వత పశుగ్రాసం పెంపకానికి రైతులు ముందుకు వస్తే వారికి కూడా ఉపాధి హామీ పథకం వర్తింపజేసేలా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు.

# కూటమి ప్రభుత్వ పాలన దుర్మార్గం

**- మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి - ఇంధన ధరల పెంపుపై వైయస్సార్సీపి భారీ నిరసన ప్రదర్శన**

**ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ -తహసిల్దార్ కు వినతి పత్రం అందజేత**







**బండి ఆత్మకూరు, మే 18, (రిపబ్లిక్ న్యూస్):-** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత దుర్మార్గపు పాలన సాగిస్తున్నారని శ్రీశైలం నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి అన్నారు. ఇటీవల పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ సోమవారం మండల కేంద్రం బండి ఆత్మకూరులో వైఎస్ఆర్సిపి శ్రేణులతో కలిసి భారీ నిరసన ప్రదర్శన చేపట్టారు. ముందుగా చక్రపాణి రెడ్డి స్థానిక బస్టాండ్ ఆవరణలోని దివంగత నేత వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నిరసన ప్రదర్శన ప్రారంభించారు. ఇందులో భాగంగా ఆయన భారీగా తరలివచ్చిన వైయస్సార్సీపి శ్రేణులతో కలిసి ఎడ్ల బండి పై ఎక్కి పెట్రోల్ డీజిల్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. మోటార్ సైకిళ్లకు తాళ్లతో కట్టి వాటిని లాగుతూ చక్రపాణి రెడ్డి వినూత్న రీతిలో నిరసన చేపట్టారు. బస్టాండ్ నుంచి తహసిల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా తరలివెళ్లి అక్కడ తహసిల్దార్ పద్మావతికి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. తాము సమర్పించిన వినతి పత్రాన్ని ప్రభుత్వానికి అందజేయాలని తహసిల్దార్ కు విన్నవించారు. అనంతరం శిల్పా చక్రపాణి రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు డీజిల్, పెట్రోల్ ధరలు పెంచమని ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచారనీ ధ్వజమెత్తారు. కానీ ఎక్కడ లేని విధంగా ఆంధ్రప్రదేశ్లో డీజిల్, పెట్రోల్ ధరలు పెంచి ప్రజల నడ్డి విరుస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఏ ఒక్కటి అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలను చంద్రబాబు నాయుడు మోసం చేస్తున్నారని తూర్పురాబట్టారు. ఒకపక్క రైతులకు యూరియా దొరకదు కూటమి నాయకులకు మాత్రం లారీలతో వస్తుందన్నారు. రసాయనిక ఎరువుల ధరలు చూస్తే మండిపోతున్నాయన్నారు. కానీ రైతుల ధాన్యానికి మాత్రం గిట్టుబాటు ధర అందదని ఆయన దుయ్యబట్టారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజలు విసుకు చెందుతున్నారన్నారు. ఇదిలా ఉంటే శ్రీశైలం నియోజకవర్గంలో ప్రభుత్వ ధరల పెరుగుదలతో పాటు బుడ్డా టాక్స్ అదనంగా ఉంటుందని చక్రపాణి రెడ్డి ఎద్దేవ చేశారు. నియోజకవర్గంలో ఎక్కడ చూసినా రేషన్ మాఫియా, ఇసుక మాఫియా, మద్యం మాఫియా, గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్ట్ షాపుల నిర్వహణ వంటి వాటితో ఎమ్మెల్యే అక్రమ వసూళ్లతో పాటు పాల్పడుతున్నారన్నారు. శ్రీశైలం దేవస్థానములో ఆఖరికి జుట్టు కట్ చేయాలన్న టాక్స్, జుట్టు పెంచాలన్న టాక్స్, మల్లన్న దర్శనంలో కూడా అక్రమ వసూళ్లకు తెరలేపుతున్నారని చక్రపాణి రెడ్డి ఆరోపించారు. వీటి పైన ఎవరైనా ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెట్టి వేధింపులకు పాల్పడుతున్నారనీ మండిపడ్డారు. ఇలాంటి దుర్మార్గపు పాలన ఎన్నో రోజులు సాగదన్నారు. రేషన్ మాఫియా పై రెవెన్యూ అధికారులు సైతం నోరు మెదపడం లేదని వీటన్నింటిపై ప్రజా ఉద్యమం రాబోతుందని హెచ్చరించారు. అక్రమ వసూళ్లపై కలెక్టర్లకు ఫిర్యాదు చేసిన కూటమి ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదని మాజీ ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేసి ప్రజలకు అండగా నిలవాలని సూచించారు. లేదంటే ప్రజల పక్షాన పోరాటం చేస్తామన్నారు. ఈ నిరసన ప్రదర్శనలో వైఎస్ఆర్సిపి నేత శిల్ప భువనేశ్వర్ రెడ్డి, వైఎస్ఆర్సిపి మండల కన్వీనర్ బారెడ్డి భాస్కర్ రెడ్డి, మండల ప్రజాపరిషత్ అధ్యక్షులు దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి, వెలుగోడు ఎంపీపీ లాలం రమేష్, వైసీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు సుజాతమ్మ, రైతు విభాగం నాయకులు దేశూ వెంకట రామిరెడ్డి, అవుటాల నాగేశ్వర్ రెడ్డి, రేగటి జగన్మోహన్ రెడ్డి, రాగాల బాబుల్, భూరం శివలింగం, విక్రమ్ సింహ నాయక్, సగిలే కృష్ణారెడ్డి వివిధ గ్రామాల వైసిపి నాయకులు ,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 114 ఫిర్యాదులు

**ఫిర్యాదులను స్వయంగా స్వీకరించి బాధితులకు చట్ట పరిధిలో న్యాయం చేస్తామని భరోసా**



**నంద్యాల క్రైం, మే 18, (రిపబ్లిక్ న్యూస్):**జిల్లా పోలీస్ కార్యాలయంలో నేడు నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ అర్జీదారుల నుండి 114 ఫిర్యాదులను స్వయంగా స్వీకరించారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులతో ఎస్పీ స్వయంగా మాట్లాడి వారి సమస్యలను క్షుణ్ణంగా తెలుసుకొని పూర్తిస్థాయిలో విచారణ జరిపి చట్ట పరిధిలో పరిష్కరించేందుకు కృషి చేస్తామని భరోసా కల్పించారు. అనంతరం చట్టపరిధిలో చట్టపరంగా ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, ఫిర్యాదులపై నిర్లక్ష్యం వహించకుండా, ఫిర్యాదులను పునరావడం కాకుండా నిర్ణీత గడువు లోపల పరిష్కారం చూపించాలని సంబంధిత అధికారులను ఆదేశించడం జరిగింది.

# జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలోని పలు విభాగాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్

**వివిధ విభాగాల పనితీరు, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలన - ప్రజలకు వేగంగా, పారదర్శకంగా సేవలు అందించాలని సిబ్బందికి ఆదేశం**

**నంద్యాల క్రైం, మే 18, (రిపబ్లిక్ న్యూస్):** జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలోని పలు ముఖ్యమైన విభాగాలను జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ సునీల్ షోరాణ్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలోని స్పెషల్ బ్రాంచ్, పాస్‌పోర్ట్ వెరిఫికేషన్ విభాగం, సోషల్ మీడియా విభాగం, సైబర్ క్రైమ్, మరియు డిస్ట్రిక్ట్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో ఫ్యాక్షన్ జోన్ తదితర విభాగాలను ఆయన సందర్శించి, అక్కడ జరుగుతున్న పనులను, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ తనిఖీ సందర్భంగా జిల్లా ఎస్పీ ఆయా విభాగాల అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు సలహాలు ఇచ్చారు.

**స్పెషల్ బ్రాంచ్ & డి.సి.ఆర్.బి:**

జిల్లాలోని శాంతిభద్రతల పరిరక్షణకు స్పెషల్ బ్రాంచ్ విభాగం నిరంతరం అప్రమత్తంగా ఉంటూ ముందస్తు సమాచారాన్ని సేకరించాలన్నారు అనంతరం రికార్డులను పరిశీలించారు.

**డి.సి.ఆర్.బి::**నేరాల నియంత్రణకు డిస్టిక్ క్రైమ్ రికార్డ్ బ్యూరో విభాగం పాత నేరస్థుల రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తూ పోలీస్ స్టేషన్లకు తగిన సమాచారం అందించాలని స్పష్టం చేశారు. ఉన్నతాధికారులకు కావలసిన సమాచారం తక్షణం అందించేలా నేరాలకు సంబంధించిన రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవాలన్నారు.

**పాస్‌పోర్ట్ విభాగం:**ప్రజల నుండి వచ్చే పాస్‌పోర్ట్ వెరిఫికేషన్ దరఖాస్తులను ఎలాంటి ఆలస్యం లేకుండా, నిబంధనల ప్రకారం వేగంగా పూర్తి చేసి పంపాలని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా పారదర్శకమైన సేవలు అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.





**సైబర్ క్రైమ్ & సోషల్ మీడియా:**

రోజురోజుకూ పెరుగుతున్న సైబర్ నేరాలపై నిఘా ఉంచడంతోపాటు సైబర్ క్రైమ్స్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సైబర్ నేరాల బాధితుల నుండి వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి సాంకేతిక పరిజ్ఞానంతో నిందితులను పట్టుకునేలా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే సోషల్ మీడియాలో వచ్చే వదంతులు, అసాంఘిక, చట్ట వ్యతిరేక పోస్టులపై నిరంతరం నిఘా ఉంచాలన్నారు.

**ఫ్యాక్షన్ జోన్ విభాగం:**జిల్లాలోని ఫ్యాక్షన్ ప్రభావిత ప్రాంతాల్లో ముందస్తు నిఘా చర్యలు చేపట్టాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి నిఘా ఉంచాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. పోలీస్ శాఖలో ప్రతి విభాగం అత్యంత కీలకమైనది. విధుల్లో అలసత్వం వహించకుండా అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలని, ప్రజలకు త్వరితగతిన న్యాయం మరియు మెరుగైన సేవలు అందించడమే మన మొదటి ప్రాధాన్యతగా“అందరూ సమర్థవంతంగా విధులు నిర్వహించాలని సంబంధిత అధికారులను సిబ్బందిని ఆదేశించారు. ఈ తనిఖీలో స్పెషల్ బ్రాంచ్ డిఎస్పి శ్రీనివాసరెడ్డి, ఆయా విభాగాల ఇన్‌స్పెక్టర్లు, ప్రభాకర్ రెడ్డి, మల్లికార్జున గుప్తా ,సూర్యమౌళి, సబ్-ఇన్‌స్పెక్టర్ ప్రతాప్, పోలీస్ ప్రధాన కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్యారా లీగల్ వాలంటీర్లకు విధులు, బాధ్యతలపై శిక్షణ కార్యక్రమం

**బలహీన వర్గాలకు న్యాయ సహాయం అందించడంలో కీలక పాత్ర పోషించాలని సూచించిన**

**జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి**

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మే 18)**

ఆంధ్రప్రదేశ్ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆదేశాల మేరకు కర్నూలు జిల్లా న్యాయ సేవ సదన్‌లో ప్యారా లీగల్ వాలంటీర్లకు విధులు, బాధ్యతలు, విధివిధానాలపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లీగల్ సర్వీసెస్ అథారిటీ చట్టం-1987 ప్రకారం ప్యారా లీగల్ వాలంటీర్లు పనిచేస్తారని తెలిపారు. వాలంటీర్లు ప్రవర్తనా నియమావళిని పాటిస్తూ బాధితుల ప్రయోజనాలను కాపాడాలని సూచించారు. సమాజంలోని సామాన్య ప్రజలు మరియు న్యాయ సేవా సంస్థల మధ్య వారధిగా వ్యవహరించాలని పేర్కొన్నారు.

జాతీయ న్యాయ సేవ అధికార సంస్థ 2009 పథకం ప్రకారం గ్రామీణ ప్రాంతాలు, బలహీన వర్గాలకు న్యాయ సహాయం అందించడంలో ప్యారా లీగల్ వాలంటీర్లు కీలక పాత్ర పోషించాలని తెలిపారు. ప్రజలకు ప్రాథమిక హక్కులు, చట్టపరమైన హక్కులు, బాధ్యతలపై అవగాహన కల్పించాలని సూచించారు.





న్యాయపరమైన సమస్యలు ఎదుర్కొంటున్న వారికి ప్రాథమిక సలహాలు, కౌన్సిలింగ్ అందించడంతో పాటు అవసరమైతే జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యాలయానికి తీసుకెళ్లి దరఖాస్తు చేసుకునేలా సహకరించాలని వివరించారు.

అనంతరం లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ చీఫ్ శివరామచంద్రరావు మాట్లాడుతూ పెండింగ్ కేసులను లోక్ అదాలత్ ద్వారా రాజీమార్గంలో పరిష్కరించుకునేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని కోరారు. చిన్నచిన్న భూమి, కుటుంబ వివాదాలను స్థానిక స్థాయిలో సామరస్యపూర్వకంగా పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు.

సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి ఆగస్టు 21, 22, 23 తేదీలలో నిర్వహించనున్న ప్రత్యేక లోక్ అదాలత్‌పై ప్రజలకు అవగాహన కల్పించి, రాజీ మార్గంలో కేసులు పరిష్కరించుకునేలా సహకరించాలని తెలిపారు.

ఉపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్తలు, రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులు, సామాజిక కార్యకర్తలు, న్యాయ విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు, విద్యార్థులు ప్యారా లీగల్ వాలంటీర్లుగా సేవలందించవచ్చని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ప్యారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

# మామిడి రైతులకు అందుబాటులో మండీ ఏర్పాటు

**: మాదిరాజు వెంకటరమణ రాజు**



**చౌడేపల్లి ప్రతినిధి మే 18 రిపబ్లిక్ న్యూస్**

మండల కేంద్రమైన చౌడేపల్లి కి సమీపంలో మామిడి రైతులకు అందుబాటులోకి మండీను ఏర్పాటు చేసినట్లు తెలుగుదేశం పార్టీ నాయకుడు మాదిరాజు వెంకటరమణ రాజు అన్నారు. సోమవారం చౌడేపల్లి నుంచి తిరుపతి మార్గంలో నూతనంగా ఏర్పాటుచేసిన మామిడి మండినీ ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ప్రసంగిస్తూ దశాబ్దాల తరబడి ఈ ప్రాంత రైతులు మామిడి ని తరలించేందుకు దామలచెరువు, చిత్తూరు, బంగారుపాళ్యం, బెంగళూరు తదితర ప్రాంతాలకు వెళ్లే వారన్నారు ఆ క్రమంలో ప్రయాణపు ఖర్చులు అదేవిధంగా జనసరి ఖర్చులు అధికం భారం పడేయమన్నారు. అయితే ఈ ప్రాంత రైతులకు అనుకూలంగా చౌడేపల్లి నుంచి తిరుపతి మార్గంలోని మందిని ఏర్పాటు చేయడం శుభపరిణామన్నారు. పండ్ల తోటల పై ఆధారపడి జీవించే రైతాంగానికి ఈ మంది ఉపయోగకరంగా ఉంటుంది. అన్నారు అనంతరం పండ్ల తోటల ఆవశ్యకతపై ఆయన వివరించారు ఈ కార్యక్రమంలో రిటైర్డ్ జడ్జి నౌషద్ అలీ, మాదిరాజు రామకృష్ణంరాజు, నూర్ భాషా, ఇస్మాయిల్ ,ప్రవీణ్ కుమార్ రాజు ,ఇర్ఫాన్ భాష, శ్రీ రామ్ గోపి, రైతులు మార్కెట్ యజమానులు పాల్గొన్నారు.

# జనగణన, జలధార పనులు, ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలి

**: కలెక్టర్ డా. ఏ.సిరి**

**ఉపాధి హామీ పనుల్లో వెనుకబడిన మండలాలపై ఆగ్రహం**

**ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెంచాలని అధికారులకు ఆదేశాలు**



**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మే 18)**

జనగణన ప్రక్రియలో పురోగతి సాధించి రాష్ట్ర స్థాయిలో కర్నూలు జిల్లాను ముందంజలో నిలపాలని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి సెన్సస్, హౌసింగ్, బడి పిలుస్తోంది, జలధారజలహారతి తదితర అంశాలపై జిల్లా, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్ష చేపట్టారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జనగణనలో నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా పనులు సాగడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్యూమరేటర్లు క్షేత్రస్థాయిలో సక్రమంగా పని చేస్తున్నారా లేదా అన్నదానిపై మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు. లక్ష్యాలు, సాధించిన ప్రగతి వివరాలను ప్రతిరోజూ సమీక్షించాలని ఆదేశించారు.

ఆదోని, ఎమ్మిగనూరు ప్రాంతాల్లో లక్ష్యాలకు చాలా తక్కువగా నమోదు జరగడంపై సంబంధిత అధికారులను ప్రశ్నించిన కలెక్టర్, పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేసి ప్రగతి మెరుగుపరచాలని స్పష్టం చేశారు. జనగణన ప్రక్రియను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని సూచించారు.

జలధారజలహారతి కార్యక్రమాల్లో పెండింగ్‌లో ఉన్న పనులను తక్షణమే గ్రౌండింగ్ చేసి, ప్రారంభమైన పనులను వేగంగా పూర్తి చేయాలని ఎంపీడీవోలకు ఆదేశించారు. పరిశ్రమల సహకారంతో ఎక్స్‌వేటర్లు ఏర్పాటు చేసినట్లు పేర్కొంటూ వాటిని పూర్తి స్థాయిలో వినియోగించాలని సూచించారు.

ఉపాధి హామీ పనుల్లో గోనెగండ్ల, పెద్దకడుబూరు, కోసిగి, బెలగల్, కృష్ణగిరి, ఓర్వకల్లు మండలాలు వెనుకబడినట్లు పేర్కొన్న కలెక్టర్, శ్రామికులకు తగిన ఉపాధి కల్పించి ఎన్ఎంఎంఎస్ హాజరు శాతాన్ని పెంచాలని ఆదేశించారు. గ్రామాల్లో అబ్జర్వేషన్ వెల్స్ ద్వారా భూగర్భ జలాల స్థాయిని నమోదు చేయాలని పంచాయతీరాజ్ అధికారులకు సూచించారు.

“బడి పిలుస్తోంది” కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల నుంచి వచ్చే పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలలలో మొదటి తరగతిలో చేర్పించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రైవేట్ పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలలకు రీ-అడ్మిషన్ల శాతం ప్రస్తుతం చాలా తక్కువగా ఉందని, దానిని పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఆదోని, కర్నూలు అర్బన్, కోడుమూరు మండలాల్లో అడ్మిషన్ల పురోగతి మెరుగుపరచాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు.

హౌసింగ్ కార్యక్రమాలపై సమీక్షిస్తూ జిల్లాకు కేటాయించిన 5,915 ఇళ్ల నిర్మాణాలను ఆగస్టు 15 నాటికి పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ నెలలోనే ఆర్ఎల్ దశలో ఉన్న 1,680 ఇళ్లను పూర్తిచేయాలని అధికారులకు లక్ష్యాలు నిర్దేశించారు. పీఎంఏవై గ్రామీణ్ పథకానికి సంబంధించిన గ్రామసభలను జూన్ 10 లోపు పూర్తి చేయాలని సూచించారు.




స్వర్ణగ్రామస్వర్ణవార్డు సిబ్బంది ద్వారా నిర్వహిస్తున్న కౌశలం పరీక్షలకు నమోదు చేసుకున్న ప్రతి అభ్యర్థి హాజరు కావాలని కలెక్టర్ తెలిపారు. పరీక్ష తేదీ, సమయ వివరాలను అభ్యర్థులకు ముందస్తుగా తెలియజేసేలా డిజిటల్ అసిస్టెంట్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్ఓ సి. వెంకటనారాయణమ్మ, హౌసింగ్ పీడీ చిరంజీవి, డ్వామా పీడీ నరసింహారెడ్డి, ఇరిగేషన్ ఎస్ఈ బాలచంద్రారెడ్డి, జిల్లా పరిషత్ సీఈఓ రమణారెడ్డి, డీఈఓ సుధాకర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# బోయకొండ గంగమ్మకు హుండీ ద్వారా రూ 1.01 కోట్లు





**చౌడేపల్లి ప్రతినిధి మే 18 రిపబ్లిక్ న్యూస్** ప్రముఖ శక్తి క్షేత్రంగా విరాజిల్లుతున్న, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి బోయకొండ గంగమ్మ దేవస్థానము నందు సోమవారము జరిగిన హుండీ లెక్కింపు నందు దేవస్థాన ఆదాయం 54 రోజులకు గాను నగదు రూపంలో రూ. 1,01,85,400.00, బంగారు 29-400 గ్రాములు, వెండి 466 గ్రాములు, ఉప కమిషనర్ ఏకాంబరం తెలిపారు విదేశీ కరెన్సీ సైతం భక్తులు కానుకలుగా వేశారన్నారు అదేవిధంగా అన్నదానము వద్ద గల హుండీ వలన రూ. 16,381లు శ్రీ రణభేరి గంగమ్మ దేవస్థానము ఆదాయం రూ. 60,452.00 వచ్చాయన్నారు.మదనపల్లి జిల్లా దేవాదాయ అధికారి విశ్వనాథ్, చౌడేపల్లి పోలీస్ సిబ్బంది, ఆంధ్ర ప్రదేశ్ గ్రామీణ బ్యాంక్, చౌడేపల్లి దేవస్థాన అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు

# అగ్నికి ఆహుతైన అరటి,నిమ్మ చెట్లు

**సుమారు 2 లక్షలు పైగా నష్టం**

**మహానంది, మే 18, (రిపబ్లిక్ న్యూస్):-**మహానంది మండలం అబ్బీపురం గ్రామానికి చెందిన మిలిటరీ సుబ్బారెడ్డి అనే రైతు పొలంలో అరటి,నిమ్మచెట్లు ప్రమాదవశాత్తు కాలిపోయాయి.సోమవారం సాయంత్రం అబ్బీపురం గ్రామం సమీపంలోని కృష్ణనందికి వెళ్లే రహదారిలో ఎకరం పొలంలో అరటి పంట, నిమ్మచెట్లు,డిప్పు పైపులు,తీగలు అగ్నికి ఆహుతి అయ్యాయి.అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించగా వారు సంఘటన స్థలానికి చేరుకొని మంటలు అదుపు చేశారు.సుమారు 2 లక్షలు పైగా నష్టం వాటిల్లినట్లు బాధితులు వాపోయారు.





## పలు అభివృద్ధి పనుల కోసం యంపి అరవింద్ ని కలిసి వినతిపత్రం అందజేసిన రేగుంట సర్పంచ్ తీట్ల లహరి రాజేష్



**మల్లాపూర్ మే 18 (రిపబ్లిక్ న్యూస్)**
మల్లాపూర్ మండలం రేగుంట గ్రామంలో పల్లె దవాఖాన భవనం శిథిలావస్థకు చేరడంతో అట్టి భవనాన్ని కూల్చి కొత్త భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయవలసిందిగ కోరుతూ నిజామాబాదు యంపి అరవింద్ ధర్మపురి ని కలిసి వినతిపత్రం అందజేసిన రేగుంట సర్పంచ్ తీట్ల లహరి రాజేష్.

అలాగే అంగన్‌వాడీ భవనాల గురించి మరియు గ్రామంలో ఉన్న తదితర సమస్యలను కూడా యంపి దృష్టికి తీసుకెళ్లడం జరిగింది.
ఈ కార్యక్రమంలో మల్లాపూర్ మండల అధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్ రెడ్డి, లవంగ శివ, జిల్లా ఉపాధ్యక్షురాలు ఎర్ర లక్ష్మి, వార్డు సభ్యుడు బాస రాజారెడ్డి, కుందేళ్ల వినోద్, బిజెపి ఐ.టి సెల్ కన్వీనర్ బండారి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## కోడి పందాల రాయుళ్ళకు శిక్ష

**ఓర్వకల్లు ప్రతినిధి, మే 18(రిపబ్లిక్ న్యూస**
ఈనెల17.వ తేదీ నాడు ఓర్వకల్లు మండలము బ్రమనపల్లి గ్రామ పొలిమేర లోని మామిడి తోట లో కోడి పంద్యాలు ఆడుతున్నటువంటి 19 మంది వ్యక్తులను ఓర్వకల్లు SI U.సునిల్ కుమార్ పట్టుకుని కోర్టు ముందు హాజరు పరచగా, JSC మేజిస్ట్రేట్ దీ.అనురాధా సదరు ముద్దాయిలకు ఒక్కొక్కరికి =o.800/- రూపాయల జరిమానా మరియు ఒక రోజు కోర్టు ఆవరణము లో ఉండులాగా శిక్ష విధించడము అయినది.

# ఉద్యమకారుల గుర్తింపునకు కమిటీ వేయడం హర్షణీయం

## భట్టు మారుతి రాజు

**హత్నూర, మే 18 (రిపబ్లిక్ న్యూస్)**



మలిదశ తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలను పణంగా పెట్టి పోరాడిన అసలైన ఉద్యమకారుల గుర్తింపు కోసం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి గారి ప్రభుత్వం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయడం పట్ల ఉద్యమకారుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ నిర్ణయంపై హత్నూర మండల ఉద్యమకారుల కమిటీ ఉపాధ్యక్షులు భట్టు మారుతి రాజు సోమవారం ఒక ప్రకటనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రం తన వల్లే ఏర్పడిందని పదేపదే చెప్పుకునే మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు (కేసీఆర్), తన పదేళ్ల పాలనలో ఏనాడూ ఉద్యమకారుల సంక్షేమాన్ని పట్టించుకోలేదని మండిపడ్డారు. నాడు ప్రాణాలకు తెగించి రోడ్లపైకి వచ్చిన ఉద్యమకారుల మాట ఎత్తిన పాపాన కేసీఆర్ పోలేదని ఆయన విమర్శించారు.

"రాష్ట్రం కోసం పోరాడిన నిజమైన యోధులను గత ప్రభుత్వం విస్మరిస్తే.. నేడు రేవంత్ రెడ్డి గారి ప్రభుత్వం వారిని గుర్తించి, గౌరవించడానికి ముందుకు రావడం చాలా సంతోషకరం. ఈ నిర్ణయంతో ఉద్యమకారులంతా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటారు."

**భట్టు మారుతి రాజు, హత్నూర మండల ఉద్యమకారుల కమిటీ ఉపాధ్యక్షులు**

ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ కమిటీ ద్వారా త్వరలోనే అర్హులైన ఉద్యమకారులందరికీ న్యాయం జరుగుతుందని, వారికి ప్రభుత్వ ఫలాలు అందుతాయని ఈ సందర్భంగా మారుతి రాజు ఆశాభావం వ్యక్తం చేశారు.

# మడకశిరలో తీవ్ర ఉద్రిక్తత

## సీఐ దురుసు ప్రవర్తన గ్రామస్తుల ఆగ్రహం

## పోలీస్ స్టేషన్ ముట్టడించి అర్ధరాత్రి ధర్నా



**శ్రీ సత్యసాయి/మడకశిర క్రైమ్,మే18,( రిపబ్లిక్ న్యూస్ ):**
శ్రీ సత్యసాయి జిల్లా మడకశిర నియోజకవర్గంలో అర్ధరాత్రి తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గ్రామోత్సవ వేడుకల్లో సీఐ దురుసుగా ప్రవర్తించారనే ఆరోపణలతో వందలాది మంది గ్రామస్తులు మడకశిర పోలీస్ స్టేషన్‌ను ముట్టడించి ధర్నాకు దిగారు.డి.అచ్చంపల్లి గ్రామంలో మారెమ్మ జాతర ఉత్సవాల సందర్భంగా చెక్కభజన కార్యక్రమాన్ని నిర్వహించేందుకు గ్రామస్తులు ఏర్పాట్లు చేశారు. ఇందుకోసం ముందస్తుగా పోలీసుల అనుమతి కూడా తీసుకున్నట్లు సమాచారం. అయితే కార్యక్రమానికి ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో తమ పేర్లు లేకపోవడాన్ని అధికార పార్టీకి చెందిన ఓ వర్గం నాయకులు గొడవకు దిగారు.ఈ నేపథ్యంలో రాత్రి చెక్కభజన ప్రారంభానికి సిద్ధమైన సమయంలో మడకశిర సీఐ సుబ్రహ్మణ్యం అక్కడికి చేరుకుని కార్యక్రమం వద్ద ఉన్న వ్యక్తిపై దురుసుగా ప్రవర్తించినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. సీఐ కొట్టడంతో ఆ వ్యక్తి స్పృహ తప్పి పడిపోయాడని వారు తెలిపారు. దీంతో ఒక్కసారిగా అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.పవిత్ర ఉత్సవంలో పోలీసుల వ్యవహారశైలిపై ఆగ్రహం వ్యక్తం చేసిన గ్రామస్తులు అర్ధరాత్రి పెద్దఎత్తున మడకశిర పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. మహిళలు, యువకులు, వృద్ధులు సహా వందలాది మంది "సీఐ డౌన్ డౌన్", "పోలీసుల అరాచకం ఆపాలి" అంటూ నినాదాలు చేశారు.పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయించి బాధితుడికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దురుసుగా ప్రవర్తించిన సీఐపై ఉన్నతాధికారులు వెంటనే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. భారీ సంఖ్యలో గ్రామస్తులు స్టేషన్‌ను ముట్టడించడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు.ప్రస్తుతం మడకశిరలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతుండగా.. ఘటనపై ఉన్నతాధికారులు ఆరా తీస్తున్నట్లు సమాచారం.పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# డీజల్, పెట్రోల్ ధరలు పెంపు -ఇక దున్నపోతు ల ప్రయాణమే దిక్కు

## ధరలను వ్యతిరేకిస్తూ ధర్నా. -కూటమిపై విరుచుకు పడ్డ మాజీ ఎమ్మెల్యే కొరముట్ల.







**రైల్వే కోడూరు మే 18 రిపబ్లిక్ న్యూస్.**
కూటమి ప్రభుత్వం పెంచిన డీజల్, పెట్రోల్ ధరలతో ఎ. పి. రాష్ట్ర ప్రజలు కుదేలు అయ్యారని ఇక వాహనాలు నడపటం కష్టం అని ప్రజల ప్రయాణలకు ఇక దున్నపోతు లే దిక్కని వై. సి. పి. రాష్ట్ర అధికార ప్రతినిధి రైల్వే కోడూరు మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు కూటమి ప్రభుత్వం తీరుపై విరుచుకు పడ్డారు,సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా వై. సి. పి. అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి వై. ఎస్. జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు చేపట్టిన ర్యాలీ లో బాగంగా రైల్వే కోడూరు పట్టణంలో మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు ఆధ్వర్యంలో వై. సి. పి. పార్టీ నాయకులు కార్యకర్తలు, ప్రజలు, వామ పక్షాలు కలిసి ధర్నా చేశారు. వై.ఎస్. ఆర్. కార్యాలయం నుంచి ఆటో కు దున్నపోతు ను కట్టి తోల్ గేటు వై. ఎస్. ఆర్. విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కొరముట్ల మాట్లాడు తూ కూటమి ప్రభుత్వం ప్రజలను నమ్మిచ్చి మోసం చేసిందన్నారు. దేశం లోని అన్ని రాష్ట్రల పాలన ఒక ఎత్తు అయితే వాటికి భిన్నంగా ఎ. పి రాష్ట్రం లో కూటమి పాలన నడుస్తుంది అన్నారు. పెట్రోలు డీజల్, గ్యాస్ ధరలను అధికంగా పెంచి ప్రజల పై పెను బారాన్ని మోపి మోడీ ప్రజల నడ్డి విరుస్తున్నారన్నారు. పెంచిన పెట్రోలు, డీజిల్ ధరలతో ప్రజలు వాహనాలు నడిపే పరిస్థితులు లేవన్నారు. ఆటోలు తోలుకొని కుటుంబాలు పోషించే వారి పరిస్థితి మరీ దయనీయంగా మారిందన్నారు. ఇక మీదట వాహనాలలో వెళ్లే వారు గేదెలు, దున్నపోతు లు, గాడిద లపై వెళ్లే పరిస్థులు దాపరించాయన్నారు. బాబు ధరలు పెంచిప్రజల పై బాదుడే బాదుడు చేశారని బాబు మోసం వేశాడు బాంబు అంటూ కూటమి ప్రభుత్వం ను దుయబట్టే నినా ధాలు చేస్తూ దుమ్మెత్తి పోశారు. ధరలు తగ్గించే వరకు ప్రజల కోసం ప్రజల కొరకు వై. సి. పి. పోరాడుతుందన్నారు. అనంతరం దున్నపోతు ర్యాలీ తో తహసీల్దార్ కార్యాలయం కు వెళ్లి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఓబుళవారిపల్లి, చిట్వేల్ మండల కన్వీనర్ లు వత్తులూరు సాయికిశోర్ రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి పలువురు నాయకులు, సర్పంచులు ఎంపీటీసీలు కార్యకర్తలు పాల్గొన్నారు.

# టీచర్ చింతల సుబ్బారెడ్డి పార్థివదేహానికి నివాళులర్పించిన ప్రభుత్వ విప్పు అరవ శ్రీధర్.





**రైల్వే కోడూరు మే 18 రిపబ్లిక్ న్యూస్.**



కోడూరు మండలం వెంకటరెడ్డి పల్లి గ్రామ వాస్తవ్యులు టీచర్ చింతల సుబ్బారెడ్డి మృతి చెందినట్లు సోమవారం తెలిసింది ఆయన మరణ వార్త తెలుసుకొని, రాష్ట్ర ప్రభుత్వ విప్ రైల్వే కోడూరు జనసేన పార్టీ శాసనసభ్యులు అరవ శ్రీధర్ వారి స్వగృహానికి వెళ్లి ఆయన భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు, ఆయన వెంట తాతంశెట్టి నాగేంద్ర, పగడాల వెంకటేష్ ఉన్నారు ఈ సందర్భంగా అరవ శ్రీధర్ ఆయన కుటుంబ సభ్యులను కలిసి ప్రగాఢ సానుభూతిని సంతాపాన్ని తెలియజేస్తూ అధైర్య పడవద్దని కూటమి ప్రభుత్వం మీ కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు, అనంతరం పెనగలూరు మండలం ఓబిలి గ్రామంలోని సోమేశుల సంతయ్య మృతి చెందినట్లు తెలుసుకొని ఆయన స్వగృహానికి వెళ్లి పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను కలిసి సానుభూతిని సంతాపాన్ని తెలియజేశారు పార్టీ అండగా ఉంటుందని అధైర్య పడవద్దని ధైర్యం చెప్పారు, చిట్వేలి మండలం తిమ్మాయపాలెం పంచాయతీ గట్టుమీద పల్లె గ్రామంలో అద్దంకి పెద్ద బాలయ్య మృతదేహాన్ని సందర్శించి ఆయన పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను కలిసి సంతాపాన్ని సానుభూతిని తెలియజేశారు,అలాగే ఆయనతోపాటు కూటమి నాయకులు సర్పంచులు ఎంపిటిసిలు కార్యకర్తలు ఉన్నారు.ప్రభుత్వ విప్, రైల్వే కోడూరు శాసనసభ్యులు అరవ శ్రీధర్ గారులి గారు మరియు జనసేన రాష్ట్ర కార్యదర్శి తాతం శెట్టి నాగేంద్ర గారు లి గారు మరియు పగడాల వెంకటేష్ గారు ఈ కార్యక్రమంలో పాల్గొని వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

# "విద్య"తోనే పేదరిక నిర్మూలన

**పేద మైనారిటీ విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి ఇంటర్ విద్య**

**ప్రతిభావంతులను గుర్తించేందుకు నిర్వహించిన ప్రవేశ పరీక్ష సక్సెస్**

**రాష్ట్రవ్యాప్తంగా 6605 మంది హాజరు -మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ వెల్లడి**

**నిర్వహణ అధికారులకు మంత్రి అభినందన**

**అమరావతి, మే 18 (రిపబ్లిక్ న్యూస్):**



విద్యతోనే యువత తాము అనుకున్న ఉన్నత స్థాయి లకు ఎదగగలుగుతారని, తద్వారా సమాజాభివృద్ధిలో తమ వంతు భాగస్వామ్యం కావాలని, విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యమవుతుందని మైనారిటీ, న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ పేర్కొన్నారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మైనారిటీ సంక్షేమ శాఖ వక్ఫ్ బోర్డు ద్వారా ఉచిత కార్పోరేట్ ఇంటర్ విద్య కోసం ప్రతిభావంతులైన విద్యార్థులను గుర్తించేందుకు నిర్వహించిన లితాలీమ్ ఏ హునర్" ప్రవేశ పరీక్ష విజయవంతమైనట్లు సోమవారం అమరావతిలో విడుదల చేసిన ప్రకటనలో మంత్రి పేర్కొన్నారు.
రాష్ట్ర వ్యాప్తంగా 10 జిల్లాలలో 27 కేంద్రాలలో ప్రవేశ పరీక్షను ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా నిర్వహించడం జరిగిందని వెల్లడించారు. కార్పొరేట్ కళాశాలలో ఉచిత ఇంటర్ రెసిడెన్షియల్ విద్య కోసం వక్ఫ్ బోర్డు ద్వారా అర్హులైన, ప్రతిభావంతులైన విద్యార్థులను ఎంపిక చేసేందుకు నిర్వహించిన ప్రవేశ పరీక్షకు రాష్ట్రవ్యాప్తంగా 7392 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడం జరిగిందన్నారు.
అయితే ప్రవేశ పరీక్షకు 6605 మంది హాజరయ్యారని,787 మంది హాజరు కాలేదని,89.35% హాజరు నమోదైనట్లు మంత్రి తెలిపారు. ప్రవేశ పరీక్షకు హాజరైన వారిలో బాలికల శాతం ఎక్కువగా ఉన్నారన్నారు.
పేద ముస్లిం మైనారిటీ కుటుంబాలలోని ప్రతిభావంతులైన విద్యార్థులకు భవిష్యత్తులో ఉన్నత విద్య అభ్యసించేందుకు బలమైన పునాదులు వేయుటకు ఇంటర్మీడియేట్ విద్య అందించేందుకు కూటమి ప్రభుత్వం వక్ఫ్ బోర్డు ద్వారా చర్యలు చేపట్టినట్లు తెలిపారు.ఇందు కోసం "తాలీమ్ ఏ హునర్" పథకం ద్వారా విద్యార్థులను ఎంపిక చేసేందుకు ప్రవేశ పరీక్ష నిర్వహణ కు శ్రీకారం చుట్టడం జరిగిందని మంత్రి ఫరూక్ పేర్కొన్నారు.
ఈ పథకానికి మైనారిటీ వర్గాలతో పాటు అన్ని వైపుల నుండి ప్రభుత్వానికి, వక్ఫ్ బోర్డుకు, ముఖ్యమంత్రికి ప్రశంసల వెల్లువలు వచ్చాయన్నారు."తాలీమ్ ఏ హునర్ "పరీక్ష సజావుగా నిర్వహించినందుకు ఆయా జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, మైనారిటీ శాఖ అధికారులు, సిబ్బందికి, ఇతర సంబంధిత శాఖల అధికారులు, సిబ్బందికి, విస్తృత ప్రచారం కల్పించిన పాత్రికేయులకు మంత్రి ఫరూక్ ధన్యవాదాలు తెలిపారు.

# మోడీకి స్వీడన్ అత్యున్నత పురస్కారం

**ఎక్స్ వేదికగా అభినందనలు తెలిపిన చంద్రబాబు**



**అమరావతి,, మే 18 (రిపబ్లిక్ న్యూస్):** ప్రధానమంత్రి నరేంద్రమోదీకి స్వీడన్ ప్రభుత్వం అత్యున్నత పురస్కారమైన 'రాయల్ ఆర్డర్ ఆఫ్ ది పోలార్ స్టార్ కమాండర్ గ్రాండ్ క్రాస్' ప్రదానం చేసింది. ఈ పురస్కారంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు సోషల్ మీడియా ఎక్స్ వేదికగా ప్రధాని మోదీకి ప్రత్యేక అభినందనలు తెలిపారు.ప్రధాని మోదీకి లభించిన ఈ గౌరవం భారతదేశానికి గర్వకారణమని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా భారత ప్రతిష్ఠను మరింత పెంచడంలో మోదీ నాయకత్వం కీలక పాత్ర పోషిస్తోందని కొనియాడారు. అంతర్జాతీయ వేదికలపై భారత్ ప్రభావాన్ని బలోపేతం చేయడంలో ప్రధాని మోదీ కీలక పాత్ర పోషిస్తున్నారని వ్యాఖ్యానించారు. స్వీడన్ ప్రభుత్వం అందించిన 'రాయల్ ఆర్డర్ ఆఫ్ ది పోలార్ స్టార్ కమాండర్ గ్రాండ్ క్రాస్' పురస్కారం ప్రధాని మోదీకి లభించిన 31వ అంతర్జాతీయ గౌరవమని ప్రస్తావించారు. ఇది వ్యక్తిగత గౌరవం మాత్రమే కాకుండా భారతదేశానికి లభించిన అంతర్జాతీయ గుర్తింపుగా సీఎం అభివర్ణించారు.

# అధిక జ్యేష్ఠం..ఆరంభం

## శుభకార్యాలకు అనువు కాదు

**తిరుపతి,, మే 18 (రిపబ్లిక్ న్యూస్):**
ఆదివారం నుంచి అధిక జ్యేష్ఠ మాసం ఆరంభమయ్యింది. అధిక మాసం అంటే అనే సందేహాలు వస్తుంటాయి. ఒకే సంవత్సరంలో ఒకే పేరున్న మాసం రెండు సార్లు వస్తే మొదటిదాన్ని అధికం అని, రెండవదాన్ని నిజమాసమని, శుద్ధం అని అంటారు. హిందూ పంచాంగం చంద్రుడి గమనాన్ని అనుసరిస్తుంది, అయితే గ్రెగోరియన్ క్యాలెండర్ సూర్యుని ఆధారంగా ఉంటుంది. చాంద్రమాన సంవత్సరం సుమారు 354 రోజులు ఉండగా, సౌర సంవత్సరం 365 రోజులు ఉంటుంది. ఈ రెండు మధ్య వచ్చే వ్యత్యాసం వల్ల ప్రతి సంవత్సరం 10,11 రోజుల తేడా ఏర్పడుతుంది. ఈ తేడా ఒక నెలకు చేరినప్పుడు, సుమారు మూడు సంవత్సరాలకు ఒకసారి అదనపు నెలను జోడిస్తారు. దానినే అధిక మాసం అంటారు. ఇది కాలమానం సమతుల్యతను కాపాడడంలో సహాయపడుతుంది. మతపరంగా ఇది ఆధ్యాత్మిక సాధనకు అత్యుత్తమ సమయంగా భావించబడుతుంది. ఈ ఏడాది మే 17, ఆదివారం నుంచి అధిక జ్యేష్ఠ మాసం ప్రారంభం అయ్యింది. 'అసంక్రాంతి మాసో అధికమాసః' అని సనాతన ధర్మశాస్త్రంలో వివరించి ఉంది. అంటే సూర్యుడు ఒక రాశి నుంచి ఇంకో రాశిలోకి ప్రయాణించడాన్ని సంక్రమణం లేదా సంక్రాతి అంటారు. ఏ మాసంలో అయితే సూర్యుడు ఒక రాశి నుంచి ఇంకో రాశిలోకి ప్రవేశించడో ఆ మాసాన్ని అధిక మాసమని అంటారు. పురాణ కథల ప్రకారం, ఈ అదనపు మాసాన్ని మొదట మల మాసం అని పిలిచేవారు. దానిని శుభకార్యాలకు అనుకూలంగా భావించలేదు. ఏ దేవుడు కూడా దీనికి అధిపతిగా ఉండటానికి ముందుకు రాలేదు. అప్పుడు శ్రీమహావిష్ణువు.. తన పేరు అయిన 'పురుషోత్తమ'ను దీనికి ఇచ్చాడు. అప్పటి నుండి ఇది 'పురుషోత్తమ మాసం'గా ప్రసిద్ధి చెందింది. ఈ మాసంలో విష్ణువును ఆరాధిస్తే అనేక రెట్లు పుణ్యఫలాలు లభిస్తాయని విశ్వాసం. చైత్రం నుండి ఆశ్వయుజ మాసం (మార్చి–అక్టోబర్) మధ్య కాలంలో ఏ నెలలో సూర్య సంక్రమణం (సూర్యుడు కొత్త రాశిలోకి ప్రవేశించడం) జరగదో, ఆ నెల అధిక మాసంగా పరిగణించబడుతుంది...మళ్ళీ 2029 సాధారణ నామ సంవత్సరంలో చైత్ర మాసము అధిక మాసం వస్తుంది..

# సెన్సస్ హౌస్ లిస్టింగ్‌లో నిర్లక్ష్యం వద్దు

## - ప్రతి ఇంటిని క్షేత్రస్థాయిలో పరిశీలించాలి : కలెక్టర్

**మే 20లోపు హౌస్ లిస్టింగ్ పూర్తి చేయాలి -కమ్యూనిటీ టాయిలెట్ బ్లాకులకు నిధుల కొరత లేదు**

**- అర్హులకు రూ.3 లక్షల మంజూరుజిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గనియ**




**నంద్యాల బ్యూరో, మే 18 (రిపబ్లిక్ న్యూస్):** జిల్లాలో సెన్సస్ హౌస్ లిస్టింగ్ ఆపరేషన్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తాసిల్దారులు మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని పీజీఆర్ఎస్ హాలులో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ అనంతరం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె అధికారులతో వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ, జిల్లాలో హౌస్ లిస్టింగ్ ప్రక్రియ కొనసాగుతోందని, మే 20వ తేదీ నాటికి ప్రక్రియను పూర్తి చేయాల్సిన అవసరం ఉందని కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లాలో "డోర్ లాక్"గా నమోదు చేసిన గృహాల సంఖ్య అధికంగా ఉండటంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలు అధికంగా ఉన్న జిల్లాలో ఇన్ని ఇళ్లు తాళాలు వేసి ఉండటం అనుమానాస్పదంగా కనిపిస్తోందని పేర్కొంటూ, అధికారులు క్షేత్రస్థాయిలో ప్రతి ఇంటిని స్వయంగా సందర్శించి క్రాస్ చెక్ చేయాలని ఆదేశించారు. అధికారులు కనీసం 95 శాతం గృహాల వివరాలు, 80 శాతం జనాభా సమాచారం పూర్తి చేయాలన్నారు. మనమిత్ర క్యాంపెయిన్ మరియు వాట్సాప్ సేవల వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సచివాలయాలకు వచ్చే ప్రజలకు వారి మొబైల్ ఫోన్ల ద్వారానే వాట్సాప్ సేవలను వినియోగించే విధానం నేర్పించి, కుల ధృవీకరణ పత్రాలు సహా ఇతర సేవలకు అదే వేదిక ద్వారా దరఖాస్తు చేయించాలన్నారు. దీనివల్ల ప్రజలకు సులభ సేవలు అందడంతో పాటు వాట్సాప్ గవర్నెన్స్ వినియోగం పెరుగుతుందని తెలిపారు. వచ్చే వారం నుంచి ఈ అంశంపై కూడా ప్రత్యేక సమీక్ష నిర్వహించనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. కమ్యూనిటీ టాయిలెట్ బ్లాకుల ఏర్పాటు విషయంలో అర్హులైన వారికి ఎటువంటి నిధుల కొరత లేకుండా ఒక్కో బ్లాక్‌కు రూ.3 లక్షల వరకు నిధులు మంజూరు చేస్తామని కలెక్టర్ తెలిపారు. కమ్యూనిటీ టాయిలెట్ అవసరమున్న వారు ఆర్.డబ్ల్యూ.ఎస్. అధికారులకు ప్రతిపాదనలు పంపించాలని సూచించారు. ఇప్పటివరకు వెటర్నరీ హాస్పిటల్స్ మరియు మండల సమాఖ్యల నుంచే ప్రతిపాదనలు అందాయన్నారు. దరఖాస్తులు అందిన ప్రతి అర్హత ప్రాంతానికి టాయిలెట్ బ్లాకులు మంజూరు చేయడంలో ఎలాంటి ఆటంకం ఉండదన్నారు. గత ఏడాది సోషల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్ హాస్టల్స్‌తో పాటు మోడల్ స్కూల్స్‌కు తొలి ప్రాధాన్యతగా టాయిలెట్ బ్లాకులు అందించినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు 579 కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌లను మంజూరు చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు.ం

# దివ్యాంగులకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది: కలెక్టర్ డా. ఏ. సిరి

**కలెక్టరేట్‌లో ట్రై సైకిళ్లు, వీల్‌చైర్లు, వినికిడి పరికరాల పంపిణీ సహాయక పరికరాల పంపిణీపై విచారణకు ఆదేశాలు**





**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మే 18)**దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో సమాజంలో ముందుకు సాగేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తోందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి తెలిపారు. కలెక్టరేట్ ఆవరణంలో విభిన్న ప్రతిభావంతులు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ దివ్యాంగులకు ట్రై సైకిళ్లు, వీల్‌చైర్లు, వినికిడి పరికరాలను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా 08 ట్రై సైకిళ్లు, 06 వీల్‌చైర్లు, వినికిడి లోపం ఉన్న ఇద్దరికి 02 వినికిడి పరికరాలను అందజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యాల్లో ఒకటని పేర్కొన్నారు. శారీరక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఎంతోమంది దివ్యాంగులు విద్య, ఉద్యోగాలు, క్రీడలు తదితర రంగాల్లో ప్రతిభ కనబరుస్తున్నారని అన్నారు. దివ్యాంగులకు అవసరమైన సదుపాయాలు, ప్రోత్సాహం అందించడం ద్వారా మరింత ఆత్మస్థైర్యం కలుగుతుందని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి లబ్ధిదారుడు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లాలో అర్హులైన దివ్యాంగులకు సేవలు మరింత సమర్థవంతంగా అందేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. అనంతరం విభిన్న ప్రతిభావంతులు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌తో సమావేశమైన కలెక్టర్, ఇప్పటివరకు పంపిణీ చేసిన సహాయక పరికరాల వివరాలపై సమగ్రంగా ఆరా తీశారు. కొన్ని ఫిర్యాదులు అందిన నేపథ్యంలో అర్హులైన దివ్యాంగులకు మాత్రమే పరికరాలు అందించాలన్నారు. ఈ అంశంపై పూర్తి స్థాయి విచారణ నిర్వహించి నివేదిక సమర్పించాలని జాయింట్ కలెక్టర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల మరియు వయోవృద్ధుల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రాయస్ ఫాతిమా, శాఖ సిబ్బంది, లబ్ధిదారులు మరియు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ టీచర్లను బోధనకు పెట్టారా.. అడ్మిషన్ల కోసం వీధుల్లో తిరగడానికి పెట్టారా..

## ఎస్ఎఫ్ఐ ఆళ్ళగడ్డ మండల కార్యదర్శి లతీఫ్



**నంద్యాల, మే 18, (రిపబ్లిక్ న్యూస్):** కార్పొరేట్ ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యను పూర్తిగా వ్యాపారంగా మార్చి ఉపాధ్యాయులను బానిసల్లా ఉపయోగిస్తున్నాయని ఎస్ఎఫ్ఐ ఆళ్లగడ్డ మండల కార్యదర్శి లతీఫ్ తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు పాఠాలు చెప్పాల్సిన టీచర్లను అడ్మిషన్లు, ఫీజులు, టార్గెట్ల కోసం ఇంటింటికీ తిప్పడం దారుణమన్నారు. టీచర్లు చదువు చెప్పాలా..? లేక అడ్మిషన్ల కోసం ప్రచారం చేయాలా..? అని ప్రశ్నించారు. కొన్ని కార్పొరేట్ ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు టీచర్లకు నెలకు ఇన్ని అడ్మిషన్లు తేవాలంటూ టార్గెట్లు విధిస్తూ, పూర్తి చేయకపోతే జీతాలు నిలిపివేయడం, ఉద్యోగాల నుంచి తొలగిస్తామని బెదిరించడం అత్యంత దౌర్జన్యమన్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు పనిచేయించి కనీస గౌరవం కూడా ఇవ్వకపోవడం అమానుషమన్నారు. తల్లిదండ్రుల నుంచి లక్షల రూపాయలు ఫీజుల పేరుతో దోచుకుంటూ, మరోవైపు టీచర్లను మానసికంగా చిత్రహింసలకు గురిచేస్తున్నా రని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇవన్నీ కళ్లముందు జరుగుతున్నా విద్యాశాఖ అధికారులు ప్రేక్షకపాత్ర వహించడం సిగ్గుచేటన్నారు. యాజమాన్యాలతో కుమ్మక్కై టీచర్ల సమస్యలను పట్టించుకోకుండా వ్యవహరించడం బాధాకరమ న్నారు. వెంటనే ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు స్పందించి ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీపై కఠిన చర్యలు తీసుకోకపోతే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు, ముట్టడులు నిర్వహిస్తామని హెచ్చరించారు.

# ప్రజా సమస్యల పరిష్కార వేదికలో "ప్లాస్టిక్ రహిత" భోజన కార్యక్రమానికి శ్రీకారం

**స్టీల్ ప్లేట్లు, గ్లాసులతో పర్యావరణ హిత చర్యలు చేపట్టిన జిల్లా పరిపాలన**

**"ప్లాస్టిక్ రహిత నంద్యాల" లక్ష్యానికి ప్రజలందరి సహకారం అవసరం : జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి**



**నంద్యాల బ్యూరో, మే 18 (రిపబ్లిక్ న్యూస్):** నంద్యాల జిల్లాను "ప్లాస్టిక్ రహిత జిల్లా"గా తీర్చిదిద్దడంలో ప్రజాలందరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే "ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్ డే)"కు హాజరయ్యే ప్రజల కోసం "ప్లాస్టిక్ రహిత" లంచ్ కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిర్మూలన దిశగా నంద్యాల జిల్లా పరిపాలన పలు చర్యలు చేపడుతోందన్నారు. "ప్లాస్టిక్ రహిత నంద్యాల" లక్ష్య సాధనలో జిల్లా ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు. ఇందులో భాగంగానే ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు 400 నుండి 450 మంది ప్రజలు తమ సమస్యలను వినిపించేందుకు కలెక్టరేట్‌కు వస్తున్నారని తెలిపారు. ఎండ, వానలను సైతం లెక్కచేయకుండా వచ్చే ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక రిసెప్షన్ ఏర్పాటు చేయడంతో పాటు, వారి సమస్యలను శ్రద్ధగా స్వీకరించి సంబంధిత అధికారులకు పంపిస్తున్నామని చెప్పారు. అదేవిధంగా ప్రజలకు మధ్యాహ్న భోజన సదుపాయాన్ని కూడా కల్పిస్తున్నామని, ఈ కార్యక్రమానికి రెడ్ క్రాస్ సొసైటీ, కాశీనాయన ఆశ్రమం మరియు నంద్యాల మున్సిపాలిటీ సంయుక్తంగా సహకరిస్తున్నాయని వివరించారు. ప్రతి సోమవారం సుమారు 450 మందికి భోజనాలు అందిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఇప్పటి వరకు విస్తరాకులపై సన్నని ప్లాస్టిక్ పొర ఉన్న పాత్రల్లో భోజనం వడ్డించేవారని, అయితే పర్యావరణ హిత చర్యల్లో భాగంగా ఇకపై సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను పూర్తిగా నివారించాలనే లక్ష్యంతో మున్సిపాలిటీ సహకారంతో 400 స్టీల్ ప్లేట్లు, 400 స్టీల్ గ్లాసులను వినియోగంలోకి తీసుకువచ్చినట్లు కలెక్టర్ వెల్లడించారు. ఇదే సమయంలో సాధారణ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మున్సిపాలిటీ పరిధిలో "స్టీల్ ప్లేట్స్ & స్టీల్ గ్లాసెస్ బ్యాంక్" ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. వివాహాలు, శుభకార్యాలు, సామూహిక కార్యక్రమాల కోసం ప్రజలు నామమాత్రపు అద్దె చెల్లించి ఈ స్టీల్ పాత్రలను వినియోగించుకోవచ్చన్నారు. ఫంక్షన్ హాళ్ల నిర్వాహకులు, సామాజిక సంస్థలు, ప్రజలందరూ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి స్టీల్ పాత్రల వినియోగాన్ని ప్రోత్సహించాలని, నంద్యాల జిల్లాను "ప్లాస్టిక్ రహిత జిల్లా"గా తీర్చిదిద్దడంలో భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

# "బడి పిలుస్తోంది"ను ఉద్యమంలా నిర్వహించాలి

**అక్రమ ప్రైవేట్ స్కూళ్లపై కఠిన చర్యలు - నిబంధనలు ఉల్లంఘిస్తే సీజ్‌కు హెచ్చరిక**

**ప్రతి గ్రామంలో ప్రభుత్వ పాఠశాల చేరికలే లక్ష్యం - బడిబాటలో ప్రత్యేక అధికారుల ఫీల్డ్ విజిట్స్ -జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**



**నంద్యాల బ్యూరో, మే 18 (రిపబ్లిక్ న్యూస్):** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలను భారీ స్థాయిలో పెంచేందుకు చేపడుతున్న "బడి పిలుస్తోంది" కార్యక్రమాన్ని ఉద్యమంలా చేపట్టాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ అనంతరం బడి పిలుస్తోంది కార్యక్రమం పై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, "బడి పిలుస్తోంది" కార్యక్రమం ద్వారా అంగన్వాడీ కేంద్రాల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటో తరగతి చేరికలను పెంచడం ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ మేరకు మంగళవారం అన్ని శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో విస్తృత పర్యటనలు నిర్వహించాలని ఆదేశించారు. మండల ప్రత్యేక అధికారులు తమ మండలాల్లో, మున్సిపల్ ప్రత్యేక అధికారులు ఆయా మున్సిపాలిటీల్లో, ఆర్డీవోలు తమ నియోజకవర్గ పరిధిలో ప్రత్యక్షంగా పర్యటించి విద్యార్థుల చేరికల పురోగతిని సమీక్షించాలని సూచించారు. జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాల్లో ఐదేళ్లు పూర్తిచేసుకున్న దాదాపు 10 వేల మంది పిల్లలు ఉన్నప్పటికీ, వారిలో కేవలం 6,500 మంది మాత్రమే ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటో తరగతిలో చేరారని కలెక్టర్ వెల్లడించారు. మిగిలిన పిల్లలను ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్న నేపథ్యంలో, ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న నాణ్యమైన విద్య, సౌకర్యాలు, ప్రభుత్వ ప్రోత్సాహక పథకాలపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో కనీస వసతులు కూడా లేని కొన్ని ప్రైవేట్ పాఠశాలలు రేకుల షెడ్లు, అసంపూర్తి భవనాల్లో నడుస్తున్నప్పటికీ తల్లిదండ్రులను ఆకర్షిస్తూ పిల్లలను చేర్చుకుంటున్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న "తల్లికి వందనం" వంటి పథకాల డబ్బులను లక్ష్యంగా చేసుకుని నాణ్యతలేని విద్యాసంస్థలు కొనసాగుతున్న నేపథ్యంలో.... అనుమతులు లేకుండానే ప్రీ-ప్రైమరీ, ప్రైమరీ తరగతులు నిర్వహిస్తూ మూడు సంవత్సరాల చిన్నారులను కూడా నర్సరీ, ఎల్కేజీల్లో చేర్చుకుంటున్న పాఠశాలలను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న విద్యాసంస్థలను సీజ్ చేయడంతో పాటు, అక్రమ అనుమతులు మంజూరు చేసినట్లు తేలితే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవన్నారు. అంగన్వాడీ ఆయాలు, అంగన్వాడీ టీచర్లు, ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు సమిష్టిగా తల్లిదండ్రులను కలసి ప్రభుత్వ పాఠశాలల్లోని సదుపాయాలు, నాణ్యమైన విద్యపై అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. బడిబాట కార్యక్రమం ద్వారా ఇప్పటికే దాదాపు 500 మంది పిల్లలను గుర్తించినట్లు వెల్లడిస్తూ, వారిని వెంటనే ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. చేరికల డ్రైవ్ సమయంలో స్కూళ్లలో హెడ్‌మాస్టర్లు, ఉపాధ్యాయులు తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. ప్రత్యేక అధికారులు అవసరమైతే తమ వాహనాల్లోనే పిల్లలను తీసుకువెళ్లి స్కూళ్లలో చేర్పించాలన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న పేద కుటుంబాల పిల్లలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ప్రతి ప్రత్యేక అధికారి తన పరిధిలో కనీసం ఒక గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతూ అక్కడి పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.

# జలధార - జలహారతి పనుల్లో పురోగతి వేగవంతం చేయాలి

**కౌశలం టెస్టుకు వచ్చే అభ్యర్థులకు పూర్తి సహకారం అందించాలి -జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**




**నంద్యాల బ్యూరో, మే 18 (రిపబ్లిక్ న్యూస్)** జిల్లాలో అమలవుతున్న జలధార-జలహారతి కార్యక్రమం పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జి రాజకుమారి ఎంపీడీఓలను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని పీజీఆర్ఎస్ హాలులో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ అనంతరం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె అధికారులతో వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ, జలధార - జలహారతి కార్యక్రమంపై ప్రతి శనివారం ముఖ్యమంత్రి నిర్వహిస్తున్న వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లాల వారీగా సమీక్ష జరుగుతోందని తెలిపారు. జిల్లాలో గుర్తించిన పనుల సంఖ్య, కలెక్టర్ కార్యాలయానికి పంపిన ప్రతిపాదనలు, మంజూరైన పనులు, ప్రారంభమైన పనులు, పూర్తయిన పనుల పురోగతిపై ప్రత్యేకంగా పరిశీలన జరుగుతోందన్నారు. గుర్తించిన పనుల సంఖ్యకు అనుగుణంగా మంజూరులు పొందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. తప్పుడు అంచనాలు, అనవసర మెటీరియల్ వ్యయాలు ఉన్న పనులను తొలగించే అవకాశం ఉన్నందున అధికారులు జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. మంజూరైన ప్రతి పని తప్పనిసరిగా గ్రౌండింగ్ దశకు చేరుకోవాలని స్పష్టం చేశారు. ఇప్పటికే 92 శాతం పనులు ప్రారంభమయ్యాయని, మిగిలిన 8 శాతం పనులను కూడా త్వరితగతిన ప్రారంభించేలా ఎంపీడీఓలు, నీటి వనరుల శాఖ ఇంజనీర్లు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.

### కౌశలం టెస్ట్ నిర్వహణలో నిర్లక్ష్యానికి తావులేదు : కలెక్టర్

కౌశలం టెస్ట్ సాధారణ జాబ్ మేళా కాదని, ప్రత్యేక ఆన్‌లైన్ పరీక్ష ద్వారా అభ్యర్థులను ఎంపిక చేసే ప్రక్రియ అని కలెక్టర్ స్పష్టం చేశారు. స్వర్ణగ్రామ్ - స్వర్ణవార్డ్ పరిధిలో డిజిటల్ అసిస్టెంట్ల పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహించబడుతున్నాయని తెలిపారు. డిగ్రీ, పీజీ పూర్తి చేసిన అభ్యర్థులకు ఆర్టీజీఎస్ ద్వారా పరీక్ష తేదీలు, పరీక్ష కేంద్రాల వివరాలు పంపుతున్నప్పటికీ నంద్యాల జిల్లాలో హాజరు శాతం ఆశించిన స్థాయిలో లేదన్నారు. పరీక్ష నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు డిజిటల్ అసిస్టెంట్లు పూర్తి సహకారం అందించాల్సిన బాధ్యత ఉందన్నారు. "సెన్సస్ సర్వే ఉంది, సమయం లేదు" వంటి కారణాలతో అభ్యర్థులను వెనక్కి పంపడం జరగకూడదన్నారు. ఆర్టీజీఎస్ ద్వారా అభ్యర్థుల నుంచి నేరుగా ఫీడ్‌బ్యాక్ సేకరిస్తున్నందున ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. కౌశలం టెస్ట్‌కు సంబంధించిన మార్గదర్శకాలు, సూచనలను ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు సంబంధిత వాట్సాప్ గ్రూపుల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic144@gmail.com